మళ్లీ అధికారమే లక్ష్యం

200కు పైగా స్థానాల్లో విజయం
● కామ్రేడ్ నల్లకన్ను శతవసంత వేడుకల్లో స్టాలిన్ ధీమా


నల్లకన్ను జన్మదినవేడుకల్లో ఆయనను సత్కరిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

చెన్నై, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వామపక్షాలతో పొత్తుపెట్టుకుని ఏడేళ్లుదాటినా తమ కూటమి చెక్కుచెదరకుండా కొనసాగుతోందని కామ్రేడ్ నల్లకన్నులాంటి కమ్యూనిస్టు దిగ్గజాలు తనకు అండగా ఉన్నందున రాబోవు అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే కూటమి 200 సీట్లకు పైగా గెలుచుకుంటుందని ఆ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ధీమా వ్యక్తం చేశారు. టీనగర్ బాలన్ ఇల్లమ్‌లోని సీపీఐ కమిటీ కార్యాలయంలో గురువారం సీనియర్ కమ్యూనిస్టునేత ఇరా నల్లకన్ను శతవసంత వేడుకల్లో పాల్గొని ఆయనను సత్కరించి, జ్ఞాపిక అందజేశారు. ఆ సందర్భంగా ఏర్పాటైన సభలో స్టాలిన్ మాట్లాడుతూ ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నేత నల్లకన్ను వందో జన్మదిన వేడుకల్లో పాల్గొనటం తనకెంతో ఆనందాన్ని కలిగిస్తోందన్నారు. వయోవృద్ధులైన నల్లకన్నుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపేందుకు రాలేదని, ఆయన ఆశీస్సులు పొందేదుకే వచ్చానని చెప్పారు. నల్లకన్ను జన్మదినవేడుకలను పళయ నెడుమారన్ నాయకత్వంలోని కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 29న కలైవానర్ అరంగంలో నిర్వహించనుందని, ఆ వేడుకల్లో రాష్ట్రంలోని రాజకీయ నేతలందరూ పాల్గొనేలా ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్విరామంగా సభలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారని తెలిపారు. ఆ జన్మదినవేడుకలకు శ్రీకారంగా పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ వేడుకలకు తాను నల్లకన్ను ఆశీస్సులందుకోవడం సంతోషంగా ఉందన్నారు. గత కొన్నేళ్లుగా నల్లకన్ను జన్మదిన వేడుకలకు డీఎంకే కూటమిలోని రాజకీయపార్టీల నేతలంతా హాజరవుతున్నామని, ఈ ఐకమత్యం ఇలాగే కొనసాగుతుందని స్టాలిన్ ధీమా వ్యక్తం చేశారు. సోషలిజాన్ని జీవితపర్యంతమూ నొక్కి వక్కాణిస్తున్న సీనియర్ కమ్యూనిస్టు దిగ్గజం నల్లకన్ను ద్రవిడ తరహా పాలనకు మద్దతిస్తూ అండగా నిలిచారని కొనియాడారు. ఈ సభలో సీపీఐ రాష్ట్ర కమిటీ కార్యదర్శి ముత్తరసన్ మాట్లాడుతూ రాబోవు అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే కూటమి 200 సీట్లు సులువుగా గెలుచుకుంటుందని ప్రకటించారని, ప్రస్తుతం కూటమిలోని మిత్రపక్షాల మధ్య ఉన్న ఐకమత్యం చూస్తుంటే 200కు పైగా సీట్లను గెలుచుకుంటుందనే నమ్మకం తనకు కలుగుతోందన్నారు. ఈ జన్మదినవేడుకల్లో మంత్రులు కేఎన్ నెహ్రూ, పొన్ముడి, ఎంపీలు టీఆర్ బాలు, తమిళచ్చి తంగపాండ్యన్, ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగో శాసనసభ్యులు రామచంద్రన్, అబ్దుల్‌సమద్, సీపీఐ రాష్ట్ర కమిటీ కార్యదర్శి ముత్తరసన్, సీపీఎం రాష్ట్ర కమిటీ కార్యదర్శి కే బాలకృష్ణన్, సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు టీకే రంగరాజన్, సీపీఎం రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యుడు జి రామకృష్ణన్, సీపీఐ రాష్ట్ర కమిటీ డిప్యూటీ కార్యదర్శులు వీరపాండ్యన్, పెరియసామి, ఆమ్‌ఆద్మీ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు వశీకరన్, రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ అధ్యక్షుడు పూచ్చి ఎస్ మురుగన్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవైకుంఠం ఆస్పత్రి భవనానికి నల్లకన్ను పేరు...

ఇదిలా ఉండగా సీనియర్ కమ్యూనిస్టు నేత నల్లకన్ను శతవసంత వేడుకలను పురస్కరించుకుని ఆయన జన్మస్థలమైన శ్రీవైకుంఠం ప్రభుత్వ ఆస్పని సీటీస్కాన్ తదితర సాంకేతిక సదుపాయాలు సమకూర్చి స్థాయి పెంచనున్నామని, అదే విధంగా ఆ ప్రాంతంలో కొత్తగా నిర్మించే ఆస్పత్రి భవనానికి ఆయన పేరు పెట్టనున్నట్లు ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించారు. 15 యేళ్ల ప్రాయంలోనే రాజకీయాల్లో ప్రవేశించి 85 సంవత్సరాలుగా నల్లకన్ను చేస్తున్న ప్రజాసేవలను భావితరాలవారు గుర్తుంచుకునేలా శ్రీవైకుంఠంలో కొత్త నిర్మించనున్న ఆసుపత్రి భవనానికి 'కామ్రేడ్ నల్లకన్ను శతవసంత భవనం' అనే పేరు పెట్టాలని ఆయన ఆదేశించారు.


ప్ల కార్డులతో నిరసన తెలుపుతున్న బీజేపీ నేతలు, కార్యకర్తలు

అత్యాచారంపై ఆగ్రహావేశాలు

అన్నాడీఎంకే, బీజేపీ ధర్నా ● తమిళిసై సహా వెయ్యి మంది అరెస్ట్

ప్యారీస్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిండిలోని అన్నా యూనివర్శిటీలో ఇంజనీరింగ్ విద్యార్థినిపై ఇటీవల జరిగిన అత్యాచారాన్ని ఖండిస్తూ అన్నాడీఎంకే, బీజేపీ పార్టీలు నగరంలో గురువారం వేర్వేరు ప్రాంతాల్లో ధర్నాలు చేపట్టాయి. అయితే, ఈ ఆందోళనలకు అనుమతి లేదన్న పోలీసులు, ఆ రెండు పార్టీలకు చెందిన సుమారు వెయ్యి మందిని అరెస్ట్‌చేశారు. అన్నా వర్శిటీలో ఇంజనీరింగ్ విద్యార్థినిపై ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ దారుణంపై బాధితురాలు ఫిర్యాదు మేరకు జ్ఞానశేఖరన్ అనే వ్యక్తిని అరెస్ట్ చేశారు. ఈ నేపథ్యంలో, రాష్ట్రంలోని ఉన్నత విద్యాసంస్థల్లో చదువుకుంటున్న విద్యార్థులకు రక్షణ కల్పించడంలో డీఎంకే ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ, విద్యార్థినిపై జరిగిన అత్యాచారాన్ని ఖండిస్తూ ధర్నా నిర్వహించనున్నట్లు అన్నాడీఎంకే, బీజేపీ ప్రకటించాయి. ఆ మేరకు అన్నా విశ్వవిద్యాలయం ప్రధాన ప్రవేశద్వారం వద్ద మాజీ మంత్రి డి.జయకుమార్ అధ్యక్షతన గురువారం ఉదయం నిర్వహించిన ధర్నాలో మాజీ మంత్రులు వలర్మతి, గోకుల ఇందిర సహా 500 మందికి పైగా పాల్గొన్నారు. అనుమతి లేకుండా చేపట్టిన ఈ ఆందోళన వల్ల ఆ ప్రాంతంలో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో పోలీసులు అన్నాడీఎంకే శ్రేణులను అరెస్ట్ చేశారు. అదే విధంగా, నుంగంబాక్కం వళ్లువర్‌కోట్టం వద్ద రాష్ట్ర బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షురాలు తమిళిసై నేతృత్వంలో జరిగిన ధర్నాలో పాల్గొన్న కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేశారు.


మాజీ ఎంపీ బాలగంగ సహా అన్నాడీఎంకే కార్యకర్తలను అరెస్ట్ చేస్తున్న పోలీసులు


అన్నా వర్శిటీ వద్ద అన్నాడీఎంకే కార్యకర్తల ఆందోళన

నిరంతరాయంగా అన్నదానం

అళగర్‌కోవిల్, మరుదమలై ఆలయాల్లో ఏర్పాట్లు ● ప్రారంభించిన సీఎం స్టాలిన్



వీడియోకాన్ఫరెన్స్ ద్వారా అన్నదాన పథకాన్ని ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

చెన్నై, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హిందూ దేవాదాయశాఖ ఆధ్వర్యంలో మదురై సమీపంలోని అళగర్‌కోవిల్ అరుళ్‌మిగు కళ్ళలగరాలయం, కోయంబత్తూరు జిల్లా మరుదమలై అరుళ్‌మిగు సుబ్రహ్మణ్యస్వామివారి ఆలయంలో భక్తులకు రోజంతా అన్నదానం చేసే పథకం గురువారం ఉదయం ప్రారంభమైంది. చెన్నై సచివాలయంలో ఆ శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి స్టాలిన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్విరామ అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇదేవిధంగా పళనిదండాయుధపాణి స్వామి ఆలయం ఆధ్వర్యంలో నడుపుతున్న పాఠశాల, కళాశాల విద్యార్థులకు మధ్యాహ్నభోజన పథకాన్ని కూడా ఆయన ప్రారంభించారు.గత అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో శ్రీరంగం ఆలయంలో, పళని దండాయుధపాణి స్వామి ఆలయంలో మాత్రమే రోజంతా అన్నదానం చేసేవారు. డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 2021 సెప్టెంబరు 16న తిరుచెందూరు సెంథిల్ ఆండవర్ ఆలయం, సమయపురం మారియమ్మన్ ఆలయం, తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామివారి ఆలయం సహా రాష్ట్ర వ్యాప్తంగా 11 సుప్రసిద్ధ ఆలయాల్లో రోజంతా అన్నదాన పథకం, 760 ఆలయాలలో ఒక పూట (మధ్యాహ్నం) అన్నదాన పథకాన్ని అమలు చేస్తున్నారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్.మురుగానందం, దేవాదాయ శాఖ కమిషనర్ పీఎన్ శ్రీధర్, అదనపు కమిషనర్ సి. హరిప్రియ, డిప్యూటీ కమిషనర్లు ఎస్.లక్ష్మణన్, పి. జయరామన్ తదితరులు పాల్గొన్నారు. మదురై అళగర్ కోవిల్ వద్ద జరిగిన కార్యక్రమంలో వాణిజ్యపన్నులు, రిజిస్ట్రేషన్ల శాఖ మంత్రి పి మూర్తి, జిల్లా కలెక్టర్ ఎంఎస్ సంగీత, కోయంబత్తూరు జిల్లా మరుదమలైలో ఏర్పాటైన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ క్రాంతికుమార్ పాడి తదితరులు, దిండుగల్ జిల్లా పళని వద్ద జరిగిన కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ ఎస్. కిషన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అన్నా వర్సిటీ ఘటనలో వెంటనే స్పందించిన పోలీసులు

● నేరస్థులను గుర్తించి

వాంగ్మూలం ఇచ్చిన బాధితురాలు

అడయార్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): అన్నా విశ్వవిద్యాలయంలో ఇంజనీరింగ్ విద్యార్థినిపై జరిగిన అత్యాచార ఘటనలో సరికొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. బాధితురాలు తనకు జరిగిన అన్యాయంపై పోలీస్ కంట్రోల్ రూంకు ఫిర్యాదు చేసింది. ఆ వెంటనే కోట్టూరుపురం అసిస్టెంట్ కమిషనర్ భారతీరాజాకు సమాచారం చేరవేయగా, ఆయన సీఐ పద్మాదేవిని అప్రమత్తం చేశారు. వెంటనే బాధితురాలిని సంప్రదించడంతో పాటు క్షణం ఆలస్యం చేయకుండా అన్నా యూనివర్సిటీలోని లైంగిక వేధింపుల నిరోధక కమిటీ సభ్యులను సంప్రదించారు. ఈ కమిటీ సమావేశానికి బాధిత విద్యార్థినిని కూడా పిలిపించారు. అక్కడ తాను లైంగిక దాడికి గురైనట్టు చెప్పింది. ఆ తర్వాత ఆ విద్యార్థిని ప్రత్యేకంగా విచారించగా, తనకు జరిగిన అన్యాయాన్ని పూసగుచ్చినట్టు వివరించింది. దీంతో ప్రత్యేక బృందం పోలీసులు రంగంలోకి దిగి యూనివర్శిటీ క్యాంపస్‌లోని సీసీ ఫుటేజీ పరిశీలించగా, వీటిలో ఒకే ఒక్క కెమెరా మాత్రమే పనిచేస్తున్నట్టు గుర్తించారు. అసిస్టెంట్ కమిషనర్ భారతీరాజా సారథ్యంలోని ప్రత్యేక బృందం పాత నేరస్తుల జాబితా తయారు చేసింది. వీరి ఫొటోలను బాధితురాలికి చూపించగా, ఆరుగురు నిందితులను ఆమె గుర్తించారు. వీరిలో నలుగురు నిందితులు జైల్లో ఉండగా, మరో ఇద్దరిలో ఒకరు చెన్నైలో లేరు. మిగిలిన ఆ ఒక్కరే జ్ఞానశేఖరన్‌గా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. జ్ఞానశేఖర్ నగరంలో మూడు ప్రాంతాల్లో బిర్యానీ దుకాణాలు నడుపుతున్నట్టు పోలీసులు గుర్తించారు. ఆయనపై 13 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, తాజాగా విద్యార్థినులపై అత్యాచారం కేసు నమోదయ్యాయని తెలిపారు. అయితే, అన్నా విశ్వవిద్యాలయంలో ఇలాంటి చర్యలకు పాల్పడ్డారా లేదా అనే విషయంపై పోలీసులు ఆరా తీస్తున్నారు. పైగా తాజా సంఘటనకు తనకు సంబంధం లేదని నిందితుడు వాదించాడు. అయితే, అతని మొబైల్ సిగ్నల్స్ ఘటన జరిగిన ప్రాంతంలో జ్ఞానశేఖరన్ ఉన్నట్టు గుర్తించారు. సైబర్ వింగ్ పోలీసులతో ఆయన మొబైల్ ఫోనును విశ్లేషించగా, అనేక అశ్లీల ఫోటోలు ఉన్నట్టు తేలింది.

నిందితుడు డీఎంకే కార్యకర్త కాదు...

విద్యార్థిని అత్యాచార కేసులో పోలీసులు అరెస్టు చేసిన నిందితుడు డీఎంకే సభ్యుడంటూ జరుగుతున్న దుష్ప్రచారాన్ని రాష్ట్ర న్యాయశాఖ మంత్రి రఘుపతి తీవ్రంగా ఖండించారు. ఇదే విషయంపై ఆయన గురువారం మీడియాతో మాట్లాడుతూ, నిందితుడు జ్ఞానశేఖరన్‌కు తమ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ కేసును ఆగమేఘాలపై మూసి వేయాల్సిన అవసరం లేదన్నారు. నిందితుడిని చట్టపరంగా కఠినంగా శిక్షిస్తామని మంత్రి తెలిపారు. గతంలో పొల్లాచ్చిలో జరిగిన వరుస అత్యాచార తరహా ఘటన కాదన్నారు. ఈ కేసులో సాక్షాత్ నాటి మంత్రి కుమారుడే నిందితుడని గుర్తు చేశారు. ఈ విషయాన్ని దాచిపెట్టేందుకు వీలుగా నాటి కలెక్టర్ తీవ్రంగా ప్రయత్నించారన్నారు. కానీ, విపక్ష సభ్యుల పోరాటం కారణంగానే కేసు నమోదు చేశారని తెలిపారు. బాధితురాలు ఫిర్యాదు చేసిన కొన్ని గంటల్లోనే నిందితుడిని అరెస్టు చేయడం జరిగిందని, నిందితుడుకి, డీఎంకేకు ఎలాంటి సంబంధం లేదని మంత్రి రఘుపతి మరోమారు స్పష్టం చేశారు.

రెండు దశాబ్దాలైనా చెరగని చేదు జ్ఞాపకాలు

● సునామీ మృతులకు ఆత్మీయుల అశ్రునివాళి


నొచ్చికుప్పం బీచ్ వద్ద సునామీ మృతులకు నివాళిగా తీరంలో పాలుపోస్తున్న గవర్నర్ - తూత్తుకుడి తీరంలో పూలు చల్లుతున్న, జాలర్లు స్థానికులు

చెన్నై, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): 'సునామీ'...రెండు దశాబ్దాల క్రితం దక్షిణ భారతదేశంలోని సముద్రతీర వాసులందరికీ పరిచయమైన కొత్త పదం... అప్పటి వరకు కథలలోనే తాటిమానంత ఎత్తుకు సముద్రం ఉప్పొంగినట్లు చదువుకుని ఆశ్చర్యపోతుండేవాళ్లు.. ఉన్నట్టుండి ఆ తాటిమానంత ఎత్తుకు మించి తీరం పొడవునా అలలు ఉవ్వెత్తున ఎగసిపడి క్షణాల్లో వేలాదిమందిని పొట్టనబెట్టుకుంది. అలలకు గల్లంతైనవారిల్లో వందలాదిమంది ఆచూకీ ఇప్పటికీ తెలియలేదు. రాష్ట్రంలో కడలూరు, కన్నియాకుమారి, తూత్తుకుడి, వేలాంగన్ని, చెన్నై మెరీనాబీచ్, పట్టినంబాక్కం, శ్రీనివాసపురం తదితర తీర ప్రాంతాల్లో అరగంటలోపే వందల సంఖ్యలో మృతదేహాలు కొట్టుకువచ్చాయి. ఎన్నూర్ బీచ్ నుంచి పటినంబాక్కం కోవలం బీచ్ వరకు పావుగంటలోపునే 206 మంది నీటమునిగి ప్రాణాలు కోల్పోయారు. ఆ ఉపద్రవంలో 10 వేల మందికిపై శవాలుగా తేలారు. మరో 2 వేల మంది గల్లంతయ్యారు. ప్రతియేటా క్రిస్మస్ పండుగ వచ్చిందంటే ఈ తీర ప్రాంతాల వాసులంతా మరుసటి రోజు తమ ఆత్మీయులకు నివాళులర్పించేందుకు సిద్ధమవుతుంటారు.. రాక్షస అలలు పొట్టనబెట్టుకున్న తమవారిని తలచుకుంటూ బాధిత కుటుంబాలలు, పలు పార్టీల నాయకులు, మత్స్యకారుల సంఘాలు సముద్రతీరాలకు వచ్చి, సామూహిక ఖననాలు జరిగిన ప్రాంతాల వద్ద, సునామీ స్మారక స్థూపాల వద్దకు వెళ్లి అంజలి ఘటించారు.

కన్నియాకుమారిలో...

కన్నియాకుమారి జిల్లాలో కుళచ్చల్, కొట్టిల్‌పాడు, మణక్కుడి, పల్లం తదితర ప్రాంతాల్లో సునామీకి బలైన వారి తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులు ఘననివాళులర్పించారు. మృతదేహాలు ఖననం చేసిన చోటా ఆయా ప్రాంతాల ప్రజలు మౌన ర్యాలీ నిర్వహించి పుష్పాంజలి ఘటించారు. సముద్రతీరంలో నిలిచి కడలితల్లిని స్మరించుకుంటూ పాలుపోశారు. కన్నియాకుమారి త్రివేణి సంగమం వద్ద ఏర్పాటు చేసిన సునామీ స్మారక చిహ్నం వద్ద మంత్రి తంగం తెన్నరసు, జిల్లా కలెక్టర్ అళగుమీనా ఎస్పీ సుందరవదనం, ఎమ్మెల్యే ఎంఆర్ గాంధీ, తదితరులు నివాళులర్పించారు. మణక్కుడి వద్ద సెయింట్ ఆండ్రీయర్ ఆలయంలో సునామీ మృతుల ఆత్మ శాంతికి ప్రార్థనలు జరిపారు.

తూత్తుకుడిలో..

తూత్తుకుడి తిరేసుపురం సముద్రతీరం వద్ద సునామీ మృతులకు స్థానికులు, జాలర్ల సంఘాల నాయకులు, ప్రముఖులు, క్రైస్తవమత పెద్దలు నివాళులర్పించారు. జాలర్ల సంఘాల నాయకులు మారిలింగం, విమల్సన్, ఫాతిమా బాబు, బాలన్ తదితరులు మౌనర్యాలీ నిర్వహించారు.

కడలూరులో...

కడలూరు సింగారతోప్పు సముద్రతీరం వద్ద గురువారం ఉదయం సునామీ మృతులకు వారి కుటుంబీకులు, స్థానికులు, రాజకీయ నాయకులు, స్థానిక సంస్థల ప్రతినిధులు ఘననివాళులర్పించారు. సముద్రంలో పాలు పోసి, పూలు చల్లి శ్రద్ధాంజలి ఘటించారు. ఇదే విధంగా తిరువళ్లూరు జిల్లా పళవేర్కాడు ప్రాంతం వద్ద కూడా స్థానికులు, జాలర్లు సునామీ మృతులకు నివాళులర్పించారు.

మెరీనాతీరంలో...

నగరంలోని మెరీనాతీరంలోనూ సునామీ మృతులకు కుటుంబీకులు, స్థానికులు, జాలర్ల సంఘాల ప్రతినిధులు నివాళులర్పించారు. ఈ నివాళి సందర్భంగా జరిగిన మౌనర్యాలీలో గవర్నర్ ఆర్ఎన్ రవి తదితరులు పాల్గొన్నారు. సముద్రతీరంలో పాలుపోసి, సునామీ మృతుల చిత్రపటాల బ్యానర్ వద్ద కొవ్వొత్తులు వెలిగించి ఆయన శ్రద్ధాంజలి ఘటించారు. ఇదే విధంగా మనలి, పట్టినంబాక్కం, శ్రీనివాసపురం, శాంథోమ్‌బీచ్, బీసెంట్‌నగర్ బీచ్, ఎలియట్స్ బీచ్ వద్ద కూడా సునామీ మృతులకు నివాళులర్పించారు.


మణక్కుడి వద్ద సిమెట్రీగార్డెన్ వద్ద సునామీ మృతులను ఖననం చేసిన చోట ప్రార్థన చేస్తున్న క్రైస్తవమతపెద్దలు - వేలాంగన్ని వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి సునామీ మృతుల ఖనన ప్రాంతం వద్ద నివాళులర్పిస్తున్న స్థానికులు, క్రైస్తవ ఫాదర్‌లు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు పిల్లల సహా ముగ్గురి మృతి

పెరంబూర్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక సెరకుండం అంగల్ మాళ్ నగర్ 4వ వీధికి చెందిన గణపతి (35), భార్య శరణ్య, కుమార్తె రియా, బంధువు జయ, ఆమె కుమార్తె హేమా (13), కుమారుడు బాలా (10) తదితరులతో కారులో బుధవారం రాత్రి దిండుగల్ వైపు వెళ్తున్నారు. వారు వత్తలగుండు సమీపంలోని ఆలయానికి వెళ్తున్నట్లు సమాచారం. గణపతి నడుపుతున్న కారు, గురువారం వేకువజామున చెంగల్పట్టు సమీపంలో పుక్కతురా జంక్షన్ సమీపంలో చెన్నై-తిరుచ్చి రహదారిపై వస్తున్న సమయంలో స్వల్పంగా వర్షం కురిసింది. ఆ సమయంలో హఠాత్తుగా అదుపుతప్పిన కారు రోడ్డుపై అడ్డదిడ్డంగా వెళ్లి, చెన్నై వైపు వెళ్తున్న కారును ఢీకొంది. ఈ ఘటనలో గణపతి కుటుంబం ఉన్న కారు రోడ్డు పక్కనే ఉన్న పొదల్లోకి దూసుకెళ్లింది. కారులో ఉన్న గణపతి, చిన్నారులు బాలా, హేమ తదితరులు సంఘటనా స్థలంలోనే మృతిచెందగా, జయ, శరణ్య, ఒకటన్న రేశ్వ రియా తదితరులకు గాయాలయ్యాయి. అదే సమయంలో మరో కారులో ఉన్న వారికి స్వల్పగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పటాలం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని, మృతదేహాలను పోస్టు మార్టం నిమిత్తం చెంగల్పట్టు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అలాగే, క్షతగాత్రులను కూడా అదే ఆసుపత్రికి పంపించి, కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.



పొదల్లోకి దూసుకెళ్లిన కారు

వేంగైవయల్ ఘటనకు రెండేళ్లు!

నిందితులెవరో... నిజానిజాలేమిటో.. ● కనిపించని దోషులకోసం సాగుతున్న దర్యాప్తు

టి.నగర్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వేంగైవయల్ సమగ్ర మంచినీటి పథకం ట్యాంక్‌లో మానవ వ్యర్థాలు కలిపిన సంఘటన జరిగి గురువారంతో రెండేళ్లు గడిచాయి. అయినా ఇప్పటి వరకూ నిందితులను కనుగొనలేకపోవడంపై ఆ గ్రామస్థుల్లో తీరని అసంతృప్తి కొనసాగుతోంది. పుదుకోట జిల్లా వేంగైవయల్ గ్రామంలోని తాగునీటి తొట్టిలో మానవ వ్యర్థాలు కలిపినట్లు 2022 డిసెంబర్ 26న వెల్లడైంది. ఈ సంఘటనపై సీబీసీఐడీ పోలీసులు విచారణ జరుపుతున్నారు. రిటైర్డ్ జడ్జి సత్యనారాయణన్ నాయకత్వంలో ఏకసభ్య కమిటీ కూడా విచారణ జరిపింది. సుమారు 220 మంది విచారణ జరిపిన సీబీసీఐడీ పోలీసులు ఐదుగురు చిన్నారులు సహా 31 మంది శ్యాంపిల్ డీఎన్ఏ పరీక్షలకు పంపారు. వీరిలో ఓ కానిస్టేబుల్ సహా ఐదుగురి స్వర నమూనాలను కూడా పంపారు. 10 మందికి లై డిటెక్టర్ పరీక్ష చేయడానికి అనుమతించాలంటూ సీబీసీఐడీ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు తోసిపుచ్చింది. ఇదిలా ఉండగా వేంగైవయల్ గ్రామంలో హద్దుమీరి దొరికిన ఆ నీటి ట్యాంక్‌ను ధ్వంసం చేయడం, ఆ నేపథ్యంలో అందులో ఉన్న నీరు చెడిపోవడం, మార్గం నుంచి ఆ గ్రామం చుట్టూ ఏడు చోట్ల చెక్‌పోస్టులు కూడా ఏర్పాటు చేశారు. ఇంత చేసినా ఆ నీటితొట్టిలో మానవ వ్యర్థాలను కలిపిన దోషులెవరో కనుగొనలేకపోయారు. ఈ విషయమై న్యాయశాఖమంత్రి ఎస్. రఘుపతి మాట్లాడుతూ ఆ సంఘటనపై ఇంకా విచారణ కొనసాగుతూనే ఉందని, పలువురికి డీఎన్ఏ పరీక్షలు చేశామని, నిజమైన దోషులను కనుగొనటమే తమ ప్రధాన టార్గెట్ అని తెలిపారు. సంఘటన జరిగి రెండేళ్లు గడిచినా నేరస్థులను పోలీసులు గుర్తించకపోవడం వెనుక బయటికిక్కలేనందున వస్తున్న తీవ్ర ఒత్తిడితో కారణమై ఉంటుందని స్థానికులు అనుమానిస్తున్నారు. ఈ అనుమానాన్ని నివృత్తి చేసి వీలైనంత త్వరగా దోషులను గుర్తించి అరెస్టు చేస్తేనే వేంగైవయల్‌లో ప్రశాంతత చేకూరుతుందని ఆ ఊరి ప్రముఖులు, సంఘసేవకులు భావిస్తున్నారు. ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం తగు చర్యలు చేపట్టాలని కూడా కోరుతున్నారు.



వేంగైవయల్ గ్రామంలోని మంచినీటి తొట్టి

బుల్లెట్ ఏనుగుకు మత్తు ఇంజక్షన్

● అటవీ శాఖ నిర్ణయం



ఏనుగు సంచారాన్ని పర్యవేక్షిస్తున్న అటవీ శాఖ అధికారులు

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లా పందలూరు, పరిసర ప్రాంతాల్లో ప్రజలకు కునుకు లేకుండా చేస్తున్న 'బుల్లెట్' అనే ఏనుగును మత్తు ఇంజక్షన్ వినియోగించి బంధించేందుకు అటవీ శాఖ అధికారులు ప్రయత్నిస్తున్నారు. నీలగిరి జిల్లా పందలూరు పరిసర ప్రాంతాల్లో 35 ఏనుగుల గుంపు మకాం వేసింది. వాటిలో బుల్లెట్ అనే ఏనుగు జనావాస ప్రాంతాల్లో ప్రవేశించి, ఇళ్లు, దుకాణాల్లో ఉన్న బియ్యం సహా ఆహార పదార్థాలు తీసుకెళ్లింది. రెండు నెలలుగా ఇళ్లను ధ్వంసం చేయడంతో పాటు ప్రజలపై కూడా ఏనుగు దాడిచేసిన ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. గత వారం 40 ఇళ్లను ధ్వంసం చేసిన నేపథ్యంలో, అటవీ శాఖ అధికారులు గుంకీ ఏనుగును రప్పించి దాని సాయంతో బుల్లెట్ ఏనుగును అడవిలోకి పంపే ప్రయత్నాలు చేపట్టారు. ఇంతలో గురువారం వేకువజామున 2 గంటలకు టాన్‌టీ క్వార్టర్స్‌లో ప్రవేశించిన ఏనుగు, తవమణి, జ్ఞానశేఖరు చెందిన ఇళ్లను ధ్వంసం చేసింది. ఇంట్లో ఉన్న వారు వెనుక తలుపు మార్గంగా బయటకు వెళ్లడంతో ప్రాణాపాయం నుండి బయటపడ్డారు. ఈ నేపథ్యంలో, బుల్లెట్ ఏనుగుకు మత్తు ఇంజక్షన్ వేయాలని అటవీ శాఖ అధికారులు నిర్ణయించారు. ప్రస్తుతం ఏనుగు సామియార్‌మల్లై ప్రాంతంలో ఉందని, దానిని బయటకు తీసుకొచ్చే చర్యలు చేపట్టినట్లు రేంజర్ వెంకటేష్ ప్రభు తెలిపారు.

నాలుగు ప్రాంతాల్లో వ్యాయామ కేంద్రాలు

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక షోలింగనల్లూర్ మండలం కారపాక్కం, కాళియమ్మన్ ఆలయ వీధి, గాంధీ మెయిన్ రోడ్డు, శశోగినన్ వీధి, అన్నా వీధి తదితర ప్రాంతాల్లో చెన్నై కార్పొరేషన్ స్థలాలున్నాయి. ఆ ప్రాంతాల్లో వ్యాయామకేంద్రాలు ఏర్పాటుకు తలా రూ.41 ల క్షలచొప్పన మొత్తం రూ.1.64 కోట్ల మేరకు నిధులు కేటాయించినట్లు అధికారులు తెలిపారు.

10 లోగా రేషన్ దుకాణాలకు చీర, ధోవతులు

పెరంబూర్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పొంగల్ సందర్భంగా ఉచిత ధోవతి, చీరలను జనవరి 10వ తేదిలోగా రేషన్ దుకాణాలకు పంపించనున్నారు. తమిళుల సంప్రదాయ పండుగ పొంగల్‌కు ఇంకా 17 రోజులు మాత్రమే ఉంది. పొంగల్ పండుగను పేదలు కూడా వేడుకగా జరుపుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం రేషన్‌కార్డుదారులకు ఉచితంగా చీర, ధోవతి, పొంగల్ గిఫ్ట్ ప్యాక్, నగదు అందజేస్తోంది. ఆ ప్రకారం, 2.50 లక్షల మంది చేనేత కార్మికుల తయారుచేసిన చీర, ధోవతులను వచ్చే నెల 10వ తేదీలోపు రేషన్ దుకాణాలకు పంపించాలని అధికారులు సూచించారు. ఈ పథకానికి రూ.100 కోట్లు కేటాయించిన రాష్ట్ర ప్రభుత్వం, చేనేత కార్మికులకు ముందుగానే చెల్లించింది.

వండలూరు పార్క్‌కు సందర్శకుల తాకిడి

పెరంబూర్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక వండలూరు జూ పార్క్‌కు సందర్శకుల తాకిడి పెరిగింది. ఈ పార్క్‌లో ఏనుగులు, సింహాలు, పులులు, చిరుతపులులు సహా 2,500 రకాల జంతువులు, పక్షులు, సరీసృపాలు సంరక్షిస్తున్నారు. ఈ పార్క్‌లోని జంతువులను చూసేందుకు పిల్లలు, సహా పెద్దలు వస్తుంటారు. క్రిస్మస్ సందర్భంగా బుధవారం సెలవు రోజు కావడంతో, సుమారు 10వేల మంది పార్క్‌ను సందర్శించినట్లు అధికారులు తెలిపారు.

నేడు అన్నాడీఎంకే ఆందోళన

ఐసిఎఫ్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే ఆధ్వర్యంలో శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టనున్నారు. ఈ మేరకు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి విడుదల చేసిన ప్రకటనలో... రాష్ట్రంలో మహిళలపై లైంగిక, అత్యాచార ఘటనలు అధికమయ్యాయని, వీటిని అరికట్టడంలో డీఎంకే ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. డీఎంకే పాలనను వ్యతిరేకిస్తూ శుక్రవారం అన్ని జిల్లాల్లో కలెక్టరేట్ల ఎదుట జరిగే ఆందోళనలకు ఎంపీలు, ఎమ్మెల్యే, ఆయా జిల్లాల కార్యదర్శులు, పార్టీ అనుబంధ సంఘాల నేతలు, కార్యకర్తలు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

కారులో మద్యపానం

● మహిళలను ప్రశ్నించిన కానిస్టేబుల్‌పై దాడి

ఐసిఎఫ్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కారులో మద్యం సేవిస్తున్న మహిళలను అడ్డుకున్న కానిస్టేబుల్‌పై దాడి జరిగిన ఘటన కొరట్టూరు ప్రాంతంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... కొరట్టూరు పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ రమేష్ బుధవారం అర్ధరాత్రి కొరట్టూరు కెనాల్ రోడ్డులో గస్తీ తిరుగుతున్న సమయంలో, రోడ్డు పక్కన కారులో ఇద్దరు మహిళలు, ఓ పురుషుడితో కలసి మద్యపానం చేస్తుండడంతో, రమేష్ అడ్డుచెప్పాడు. ఈ విషయమై మహిళలకు కానిస్టేబుల్ మధ్య వాగ్వాదం జరిగిన క్రమంలో, ఒక్కసారిగా కానిస్టేబుల్‌పై దాడిచేశారు. చుట్టుపక్కల వారు సమాచారం అందించడంతో అక్కడకు చేరుకున్న కొరట్టూరు పోలీసులు, గాయపడిన రమేష్‌ను ఆస్పత్రికి తరలించి, దాడికి పాల్పడిన ఇద్దరు మహిళలు, పురుషులను అదుపులోకి తీసుకున్నారు.

పొంగల్‌కు 60 వేల మంది రిజర్వేషన్

ఐసిఎఫ్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): చెన్నై మహా నగరంలో ఉండే ప్రజలు పొంగల్ పండుగ కోసం సొంతూళ్లకు వెళ్లేందుకు 60వేల మంది ముందస్తు రిజర్వేషన్ చేసుకున్నారు. ఈ క్రమంలో జనవరి 10వ తేదీ నుండి చెన్నై నుంచి కుంభకోణం, తంజావూరు, కోవై, తిరుప్పూర్, పొల్లాచ్చి, సేలం, ఈరోడ్ ప్రాంతాలకు వెళ్లే బస్సుల్లో అత్యధిక సంఖ్యలో ప్రజలు రిజర్వేషన్ చేసుకున్నారు. 10న తేది 17,500, 11న 18,000, 12న 11,500, 13వ తేది 11,000లకు పైగా ప్రయాణికులు రిజర్వేషన్ చేసుకున్నట్లు అధికారులు తెలిపారు.

జలాశయాల్లో 84 శాతం పెరిగిన నీటినిల్వలు

పెరంబూర్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరం చెన్నై వాసులకు తాగునీరందించే ఐదు జలాశయాల్లో 84.88 శాతం నీటినిల్వలున్నాయి. ఈ జలాశయాల పూర్తి సామర్థ్యం 11.757 టీఎంసీలు కాగా ప్రస్తుతం 9.980 టీఎంసీల నిల్వలున్నాయి. ఆ ప్రకారం, చెంబరంబాక్కం జలాశయంలో 89.19 శాతం, పుళల్‌లో 90.42 శాతం, పూండి 95.36 శాతం, చోళవరం 17.58 శాతం, కన్నన్‌కోట జలాశయంలో 94.8 శాతం నీటినిల్వలున్నట్లు ప్రజాపనుల శాఖ అధికారులు తెలిపారు.

పదేళ్లలో జాలర్ల సంపద రూ.150 కోట్ల మేర దోపిడీ

● అడ్డూ అదుపులేని లంక నావికదళం దాడులు

టి.నగర్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): తమ దేశ సముద్ర సరిహద్దుల్లో చొరబడ్డారంటూ శ్రీలంక నావికాదళం ఆదేపదేగా తమిళ జాలర్లను తుపాకులతో బెదిరించడం, ఐనుపరాడ్లతో దాడికి పాల్పడడం నిత్యకృత్యంగా మారింది. దేశరక్షణ కంటే తమిళ జాలర్లను చిత్రహింసలకు గురిచేసి వారంతా కష్టపడి సంపాదించిన వలలు, యంత్ర పరికరాలు జీపీఎస్, సెల్‌ఫోన్లు మాత్రమే కాదు, పడవలో చేపలను కూడా దోచేసి తీసుకెళ్తే స్థితికి దిగజారింది. ఇలా గత పదేళ్లుగా తమిళ జాలర్లకు చెందిన రూ.150 కోట్ల విలువైన పడవలను, వస్తుసామగ్రిని దోచుకెళ్తినట్లు తాజా లెక్కలు వెలువడ్డాయి. భారత-శ్రీలంక మధ్య నాగపట్టణం నుంచి రామేశ్వరం వరకు 25 నుండి 40 కి.మీల వెడల్పు (విస్తీర్ణం) ఉన్న సముద్రతీర ప్రాంతం చేపల సంపద పుష్కలంగా లభించే, ఈ ప్రాంతాల్లోనే జాలర్లు దశాబ్దాల తరబడి చేపలవేట సాగిస్తున్నారు. ఈ సముద్ర ప్రాంతం వెడల్పు కాస్త తక్కువగా ఉండటం వల్ల రెండు దేశాల జాలర్లు తెలియకుండా సరిహద్దులు దాటిన సంఘటనలు జరుగుతుంటాయి. భారత నావికాదళం శ్రీలంక జాలర్లు సరిహద్దులు దాటితే హెచ్చరించి వారిని తిప్పిపంపుతుంటారు. అదే శ్రీలంక నావికాదళం అయితే తమిళ జాలర్లను చితకబాది మీదుల్లే అరెస్టు చేసి తీసుకెళ్తుంటారు. అందులోనూ 2018లో శ్రీలంక ప్రభుత్వం విదేశీ చేపలవేట సవరణ చట్టం చేసిన తర్వాత ఇది ఇం దాడులు అధికమయ్యాయి. ఆ చట్టం ప్రకారం తమ దేశ సరిహద్దుల్లో చొరబడే విదేశీ జాలర్లు (తమిళ జాలర్లు)కు 6 మాసాల నుండి రెండున్నర సంవత్సరాల దాకా జైలు శిక్షతోపాటు జాలర్లు ఉపయోగించిన పడవలను స్వాధీనం చేసుకోవచ్చు. ఈ శ్రీలంక కోర్టులు జాలర్లను విడిపించడానికి సుముఖత వ్యక్తం చేస్తాయి కానీ, లక్షల విలువచేసే మరపడవలను మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ విడిపెట్టేందుకు అంగీకరించవు. సాధారణ నాటు పడవలు, ఫైబర్ పడవలయితే వాటిని కట్లాల్లో జాలర్లకు తిరిగి అప్పగించేందుకు ఆదేశిస్తాయి. ఈ చట్టం అమలులోకి వచ్చినప్పటి నుండే తమిళ జాలర్ల ఆక్రమ నిర్బంధాలు అధికమయ్యాయి. సమాచార హక్కు చట్టం ప్రకారం వెలుగులోకి వచ్చిన వివరాల మేరకు తమిళ జాలర్ల అరెస్టులు, పడవల స్వాధీనానికి సంబంధించిన వివరాలు వెలువడ్డాయి. ఆ మేరకు 2014లో 787 మంది, 2015లో 454 మంది, 2016లో 290 మంది, 2017లో 453 మంది, 2018లో 148 మంది, 2019లో 203 మంది, 2020లో 59 మంది, 2021లో 159 మంది, 2022లో 237 మంది, 2023లో 230 మంది, 2024 జూలై నెలాఖరువరకు 268 మంది చొప్పున ఇప్పటిదాకా 3288 మంది తమిళజాలర్లను శ్రీలంక నావికాదళం అక్రమంగా అరెస్టు చేసింది. ఇదేవిధంగా 2014లో 164 పడవలు, 2015లో 71, 2016లో 51, 2017లో 84, 2018లో 14, 2019లో 41, 2020లో 9 , 2021లో 19 , 2022లో 34, 2023లో 34, 2024లో 39 పడవల మొత్తం 558 పడవలను స్వాధీనం చేసుకుంది. వీటిలో 365 పడవలను లంక ప్రభుత్వం జైనం చేసుకుంది. జాఫ్నాలోని భారతరాయబార కార్యాలయం నుండి సమాచార హక్కు చట్టం ప్రకారం ఈ వివరాలు వెల్లడయ్యాయి. ప్రస్తుతం శ్రీలంక ప్రభుత్వ ఆధీనంలో ఉన్న పడవలను స్వదేశానికి తరలించే ప్రయత్నాలు చేపడుతున్నట్టు భారత రాయబార కార్యాలయం అధికారులు పేర్కొన్నారు.



సమాచార దృష్టి

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా తిరువొత్తియూర్ పరిధిలోని పులియంబేడు మెయిన్ రోడ్డు, జడ్జీల కాలనీ, రాజన్ గార్డెన్, నేషనల్, దేవి నగర్, బాలాజీ నగర్, భాగ్యలక్ష్మి నగర్, పెద్ద వీధి, సూర్యా నగర్, అశోక్ నందనం తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

తిరుచ్చి, మదురైలో టైడల్ పార్కులు

పెరంబూర్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): తిరుచ్చి, మదురైలో టైడల్ పార్క్ ఏర్పాటుకు పర్యావరణ అనుమతులు కోరుతూ దరఖాస్తుచేసుకున్నారు. మదురైలో రూ.289 కోట్లతో 12 అంతస్తుల టైడల్ పార్క్ ఏర్పాటు కానుంది. దీనిద్వారా 5వేల మందికి ఉపాధి లభించనుంది. తిరుచ్చిలో రూ.415 కోట్ల వ్యయంతో 6 అంతస్తులతో టైడల్ పార్క్ ఏర్పాటుకానుందని అధికారులు తెలిపారు.

600 మెగావాట్ల విద్యుదుత్పత్తికి అంతరాయం

పెరంబూర్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఉత్తర చెన్నై థర్మల్ విద్యుత్ కేంద్రంలో మరమ్మతుల కారణంగా 600 మెగావాట్ల ఉత్పత్తికి అంతరాయం కలిగింది. రెండో కేంద్రంలోని రెండో యూనిట్‌లో బాయిలర్ ట్యూబ్ లీకేజీ కారణంగా 600 మెగావాట్ల విద్యుత్పత్తికి అంతరాయం కలిగింది. ఇదిదారికి ఈ కేంద్రంలోని 1వ యూనిట్‌లో ఉత్పత్తి నిలిపివేసిమరమ్మతులు పనులు జరుగుతున్నాయి.

రూ.3 కోట్లతో విద్యుత్ దహనవాటికలు

పెరంబూర్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక పల్లవరం, అనకాపుత్తూర్ ప్రాంతాల్లో రూ.3 కోట్లతో దహన వాటిక నిర్మాణాలు జరుగుతున్నాయి. తాంబరం కార్పొరేషన్ పరిధిలో క్రోంపేట, కీలకట్టలై, చిట్లపాక్కం, హస్తినాపురం, వెస్ట్ తాంబరం సహా ఏడు ప్రాంతాల్లో దహనవాటికలున్నాయి. ఈ క్రమంలో, పల్లవరం, అనకాపుత్తూర్ ప్రాంతాల్లో అంత్యక్రియల కోసం చాలా దూరం వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. దీనిపై దృష్టి సారించిన కార్పొరేషన్ పల్లవరం మలకంతపురం, అనకాపుత్తూర్ ప్రాంతాల్లో తలా రూ.1.50 కోట్లతో విద్యుత్ దహనవాటికలను నిర్మిస్తోంది. జనవరి నుంచి ప్రజలకు అందుబాటులోకి వస్తాయని అధికారులు తెలిపారు.

3 నుంచి 64 శక్తిరూపాల్లో వారాహి సంగమం

పెరంబూర్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక మైలాపూర్‌లో 64 శక్తిరూపాల్లో వారాహి అమ్మవారు దర్శనమిచ్చే వేడుకలు, ప్రత్యేక యాగాలు, మూడు రోజులు నిర్వహించనున్నారు. మైలాపూర్ దక్షిణ మాడ వీధిలో ఉన్న ఎల్ఎల్ విజయకుమార్ బొమ్మై సత్రంలో తొలిసారిగా, జనవరి 3 నుంచి 5వ తేది వరకు 64 శక్తి రూపాల్లో వారాహి అమ్మవారు దర్శనమివ్వనున్నారు. ఈ సందర్భంగా అష్ట వారాహి ట్రస్ట్ ఆధ్వర్యంలో యాగాలు, పూజలు, నత్యంగం తదితర కార్యక్రమాలు జరుగుతాయని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు.

31 వరకు ప్రత్యేక టీకా శిబిరాలు

పెరంబూర్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): పిల్లలకు నిర్ణీత సమయంలో టీకాలు వేయించకపోతే ఈ నెల 31వ తేది వరకు ప్రత్యేక శిబిరాల ద్వారా టీకాలు వేయిస్తున్నట్టు ఈ మేరకు ఆరోగ్యశాఖ డైరెక్టర్ సెల్వవినాయగం విడుదల చేసిన ప్రకటనలో... పిల్లలు పలురకాల వ్యాధుల బారిన పడకుండా 11 రకాల టీకాలు వేస్తున్నారు.మొత్తం 11వేల కేంద్రాల్లో టీకాలు వేస్తున్నారు. పిల్లలు జన్మించిన 4,10,14 వారాల్లో పెంటావాలెంట్ అనే టీకా వేస్తుంటారు. నిర్ణీత కాలంలో టీకా వేయని పిల్లల సౌకర్యార్థం ఈ నెల 31వ తేది వరకు అన్ని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటుచేస్తున్నట్టు, పెంటావాలెంట్‌తో పాటు ఇతర టీకాలు కూడా ఈ శిబిరాల్లో పొందవచ్చని ఆరోగ్యశాఖ తెలిపింది.

28, 29 తేదీల్లో రోప్‌కార్ సేవలు నిలిపివేత

పెరంబూర్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): కరూర్ జిల్లా అయ్యర్‌మలైలో ఉన్న రోప్‌కార్ సేవలు ఈ నెల 28,29 తేదీల్లో నిలిపివేస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. కులితలై సమీపం అయ్యర్ కొండపై రత్నగిరీశ్వరాలయం దేవాదాయశాఖ ఆధీనంలో ఉన్న ఈ కొండ ఆలయానికి వెళ్లేందుకు 1,017 మెట్లు ఎక్కాల్సి ఉంటుంది. కొండ ఎక్కలేని భక్తుల సౌకర్యార్థం మూడు నెలల క్రితం రోప్‌కార్ సేవలు ప్రారంభించారు. ఈ క్రమంలో, మాసాంతపు పనుల కారణంగా 28 నుంచి రెండు రోజులు రోప్‌కార్ సేవలు నిలిపివేస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

తిరుత్తణి కొండ పైకి వాహనాల నిషేధం

పెరంబూర్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): తిరుత్తణి కొండ ఆలయం పైకి వాహనాలు వెళ్లేందుకు అధికారులు నిషేధం విధించారు. ఈ కొండ ప్రాంగణంలో 500-750 వాహనాలు మాత్రమే పార్కింగ్ చేసే సదుపాయం ఉంది. అంతకు మించి వాహనాలు వస్తుండడంతో రోడ్డు పక్కనే వాహనాలు నిలుపుతుండడంతో ట్రాఫిక్ రద్దీ ఏర్పడుతోంది. ఈ విషయమై దృష్టి సారించిన అధికారులు, ప్రభుత్వ సెలవు రోజులు, వారాంతపు సెలవులు, ఆలయంలో జరిగే విశేష పూజల సమయంలో కార్లు, వ్యాన్లు కొండ ఆలయానికి వెళ్లేందుకు నిషేధం విధించగా, ద్విచక్రవాహనాలు, ఆటోలను యధావిధిగా అనుమతించనున్నారు. ఆ సమయంలో కొండ వెనుక భాగంలో పార్కింగ్ కల్పించినట్లు, భక్తులు, దివ్యాంగుల సౌకర్యార్థం రెండు ప్రభుత్వ, ఒక ప్రైవేటు బస్సులు ఏర్పాటుచేసినట్లు అధికారులు తెలిపారు.

వర్సిటీ హాస్టల్ విద్యార్థులకు కఠిన నిబంధనలు

ప్యారీస్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిండిలోని అన్నా వర్సిటీ ప్రాంగణంలో ఇంజనీరింగ్ విద్యార్థినిపై అత్యాచారం జరిగిన సంఘటన నేపథ్యంలో, ఆ వర్సిటీ హాస్టల్ విద్యార్థులకు గురువారం నుంచి కఠిన నిబంధనలు విధించారు. ఇంతకు ముందు రాత్రి 8 గంటల వరకు విద్యార్థుల హాస్టల్‌లో తమకు కేటాయించిన గదులకు చేరుకోవేవారు.అయితే, ఇకనుంచి సాయంత్రం 6.30 గంటల్లోపే వెళ్లాలని, ఆలస్యంగా వెళ్లాలనుకొనే వారు ముందుగానే వార్డెన్‌కు సమాచారం ఇవ్వాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ వర్సిటీలో చదువుకుంటున్న విద్యార్థుల తప్పనిసరిగా ఫోటో కూడిన గుర్తింపు కార్డు ధరించాలని, లేకుంటే వారిపై క్రమశిక్షణ చర్యలుంటాయని హెచ్చరికలు జారీ అయ్యాయి. విద్యార్థులకు పటిష్ఠ భద్రత కల్పించేందుకు ప్రత్యేక కమిటీని కూడా నియమించినట్లు అన్నా వర్సిటీ అధికారులు తెలిపారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

● పొంగులేటి



అడయార్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): నగరం నడిబొడ్డున ఉన్న అన్నా విశ్వవిద్యాలయంలో విద్యార్థినిపై జరిగిన లైంగికదాడి ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నట్లు భారతీయ జనతా పార్టీ తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల సహ ఇన్‌చార్జ్ డాక్టర్ పొంగులేటి సుధాకర్ రెడ్డి పేర్కొన్నారు. ఇదే విషయంపై ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. అన్నా వర్సిటీలో జరిగిన ఆఘాయిత్యాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, ఈ కేసులో దోషులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే, న్యాయం కోసం ఆందోళన చేస్తున్న బీజేపీ, బీజేపీ అనుబంధ సంఘాల నేతలను పోలీసులు అరెస్టు చేయడం దారుణమన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న నేరాలకు, క్షీణించిన శాంతిభద్రతలకు ముఖ్యమంత్రి స్టాలిన్ నైతిక బాధ్యత వహించాలని సుధాకర్ రెడ్డి డిమాండ్ చేశారు.

ఇండిగో విమానం అత్యవసర ల్యాండింగ్

పెరంబూర్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సాంకేతికలోపం కారణంగా ఇండిగో విమానం త్రిశూలం విమానాశ్రయంలో అత్యవసర ల్యాండింగ్ చేశారు. నగరం నుంచి 113 మంది ప్రయాణికులతో ఇండిగో విమానం గురువారం ఉదయం బెంగళూరు బయల్దేరింది. విమానం ఆకాశంలోకి ఎగురుతున్న సమయంలో సాంకేతిక లోపాన్ని గుర్తించిన పైలెట్, వెంటనే విమానాశ్రయ అధికారులకు సమాచారం అందించాడు. అధికారుల అనుమతితో విమానం మళ్లీ త్రిశూలం విమానాశ్రయంలో అత్యవసర ల్యాండింగ్ చేశారు. ప్రయాణికులను విమానాశ్రయంలోని విశ్రాంతి గదులకు తరలించిన అధికారులు, విమానంలో ఏర్పడిన సాంకేతిక లోపం సవరించేందుకు ఉపక్రమించారు.

మరణిస్తూ... ఆరుగురికి పునర్జన్మ



సంజయ్ (ఫైల్‌ఫోటో)

పెరంబూర్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): బ్రెయిన్ డెడ్ అయిన యువకుడు అవయవదానంతో ఆరుగురు పునర్జన్మ పొందారు. రామనాథపురం జిల్లా కదలాడి ప్రాంతానికి చెందిన సంజయ్ (22) ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్నాడు. ఈ నెల 22న కొత్త ద్విచక్రవాహనం కొనుగోలు చేసేందుకు మదురైలోని షోరూమ్‌కు వెళ్లాడు. టెస్ట్ డ్రైవ్ చేసేందుకు హెల్మెట్ సరిగా పెట్టుకోకుండా సంజయ్ వెళ్లినట్టు సమాచారం. వాహనంపై వెళ్తున్న సమయంలో హఠాత్తుగా కింద పడిన సంజయ్ తలకు బలమైన గాయాలయ్యాయి. ఆతడిని వెంటనే మదురై మీనాక్షి మిషన్ ఆస్పత్రికి తరలించగా, ఈ నెల 24వ తేది రాత్రి బ్రెయిన్‌డెడ్ అయినట్లు వైద్యులు నిర్ధారించారు. వైద్యుల సూచనతో సంజయ్ అవయవాల దానం చేసేందుకు కుటుంబసభ్యులు అంగీకరించారు. అవయవదానం చేసిన సంజయ్‌కు ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు.

స్పిన్నింగ్ మిల్లులో అగ్నిప్రమాదం

ప్యారీస్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): తిరుప్పూర్ జిల్లా వేలన్‌నగర్‌లో ఉన్న ప్రైవేటు స్పిన్నింగ్ మిల్లులో గురువారం ఉదయం సంభవించిన అగ్నిప్రమాదంలో నూలు యంత్రాలు ధ్వంసమయ్యాయి. ఈ స్పిన్నింగ్ మిల్లులో పనిచేస్తున్న సుమారు 60 మంది గురువారం ఉదయం విధులకు హాజరయ్యారు. ఆ సమయంలో నూలు తయారీ యంత్రం వద్ద నుంచి మంటలు వ్యాపించడం చూసిన ఉద్యోగులు, మంటలు ఆర్పేందుకు యత్నించారు. అయితే, మంటలు ఎగసిపడడంతో మిల్లు యజమాని కరుప్పన్ అందజేసిన సమాచారంతో అక్కడకు చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది సుమారు గంట క్రమించి మంటలు అదుపుచేశారు. ఆలోపే మంటల్లో నూలు తయారీ యంత్రాలు, నూలు బండిళ్లు కాలిపోయాయని, వాటి విలువ లక్షల్లో ఉంటుందని అనుమానిస్తున్నారు. పోలీసుల ప్రాథమిక విచారణలో... విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు తెలిసింది.

డీటీ వద్ద రూ.2 కోట్ల మోసం


● చెన్నై యువకుడి అరెస్ట్

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ తహసీల్దార్ దగ్గర రూ.2 కోట్ల మోసానికి పాల్పడిన చెన్నై యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈరోడ్ జిల్లా పెరుందురై తిరువేంగడంపాళ్యం గాంధీ నగర్‌కు చెందిన సుందరాంబాళ్ శక్తి మంగళ్‌లో రెవెన్యూ శాఖ డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్నారు. 2022 మార్చిలో చెన్నై రెడ్‌హిల్స్ భజన ఆలయ వీధికి చెందిన రామదాస్ కుమారుడు కలైవానన్ (37) తాను డీఎస్పీ అని సుందరాంబాళ్‌తో పరిచయం చేసుకున్నాడు. 2023లో రెవెన్యూ శాఖలో, సుందరాంబాళ్ కుమారుడు షణ్ముగరాజ్‌కు ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించిన కలైవానన్ రూ.2 కోట్లు తీసుకున్నాడు. కానీ, ఇప్పటివరకు ఉద్యోగం విషయమై ఎలాంటి సమాచారం లేకపోగా, తీసుకున్న నగదు కూడా వెనక్కి ఇవ్వలేదు. ఈ విషయమై సుందరాంబాళ్ ప్రశ్నించగా, కుమారుడిని హత్యచేస్తానని కలైవానన్ బెదిరించినట్లు తెలిసింది. ఈ విషయమై ఈ నెల 9వ తేది సుందరాంబాళ్ పెరుందురై పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదుచేసిన పోలీసులు కలైవానన్‌ను అరెస్ట్ చేసి జైలుకు తరలించారు.

పుళల్ జైల్లో సెల్‌ఫోన్ స్వాధీనం

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక పుళల్ కేంద్ర కారాగారంలో సెల్‌ఫోన్‌ను జైలు సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. ఈ జైలులో కొద్దిరోజులుగా అధికారులు, సిబ్బంది ఖైదీలు బెదిరిస్తున్న ఘటనలు జరుగుతున్నాయి. దీంతో, జైలులో భద్రత కట్టుదిట్టం చేసిన అధికారులు, గస్తీ ముమ్మరం చేశారు. బుధవారం పట్టినేరి, గంజాయి కేసులో అరెస్టయిన రవికుమార్‌ను బంధించిన గది వెనుక వైపున్న మట్టిలో జైలు సిబ్బంది సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంపై జైలు అధికారుల ఫిర్యాదుతో పుళల్ పోలీసులు కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు.

బస్సులో తరలిస్తున్న గంజాయి స్వాధీనం



బస్సులో తనిఖీలు చేస్తున్న పోలీసులు

తిరుత్తణి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర నుంచి బస్సులో తరలిస్తున్న 25 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం మేరకు... తిరుత్తణి సమీపంలోని పొన్పాడి చెక్‌పోస్ట్‌లో బుధవారం పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో ఆంధ్ర రాష్ట్రం తిరుపతి నుంచి చెన్నై వెళ్తున్న బస్సులో ప్రయాణికుల లగేజీ తనిఖీ చేయగా, 25 కిలోల గంజాయి లభ్యమైంది. ఈ వ్యవహారంలో దినేష్, ప్రతాప్‌కుమార్, విజయ్ ఆంధ్రలో గంజాయి కొనుగోలు చేసి కాంచీపురం తరలిస్తున్నట్టు తెలియడంతో వారిని అరెస్టు చేశారు. అలాగే, మరో బస్సులో తనిఖీలు చేపట్టిన పోలీసులు, నిషేధిత 6 కిలోల గుట్కా ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని తిరుత్తణి జిల్లా నగరి సమీపంలో ఓజుకుప్పానికి చెందిన అరుణ్‌ను అరెస్ట్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఆంధ్రా యువకుడి మృతి

తిరుత్తణి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ జిల్లా పళిపట్టు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆంధ్రా యువకుడు మృతిచెందగా, మరొకరికి గాయాలయ్యాయి. తిరుపతి జిల్లా పుల్లూరుకు చెందిన సురేష్ (34), అదే గ్రామానికి చెందిన వినోద్‌తో కలసి ద్విచక్రవాహనంపై బయల్దేరారు. పళిపట్టు సమీపంలోని నగరి రహదారిలో బైక్‌ను టిప్పర్ లారీ ఢీకొంది. ఈ ఘటనలో సురేష్ మృతిచెందగా, వినోద్‌కు గాయాలయ్యాయి. ఈ ఘటనపై పళిపట్టు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

2024 ఆఖరి శుక్రవారం.. ఎన్ని సినిమాలు విడుదలంటే...


'రాజాకిలి'లో తంబి రామయ్యా - సముద్రఖని

ఈ యేడాది (2024)లో చివరి శుక్రవారమైన 27వ తేదీ ఏకంగా పది చిత్రాలు విడుదలవుతున్నాయి. సాధారణంగా ప్రతి యేటా చివరి శుక్రవారం రోజున అధిక సంఖ్యలో సినిమాలు విడుదలవుతుంటాయి. ఆ కోవలోనే ఈవారం కూడా ఏకంగా పది చిత్రాలు ప్రేక్షకుల ముందుకు వస్తున్నాయి. అయితే, ఇవన్నీ చిన్న బడ్జెట్ సినిమాలే కావడం గమనార్హం. వీటిలో ప్రముఖ నటుడు సముద్రఖని నటించినవి రెండు చిత్రాలున్నాయి. అలాగే, సుప్రీంస్టార్ శరత్ కుమార్ నటించిన చిత్రం ఉంది. మిగిలినవన్నీ చిన్న హీరోల సినిమాలు కావడం గమనార్హం. నేడు విడుదలయ్యే చిత్రాల జాబితాలో 'అలంగు', 'భీమా చిత్రుండి', 'ఇదు ఉనక్కు తేవైయా', 'కూరన్', 'మళైయిల్ ననైగిరేన్', 'నెంజు పొరుక్కుదిల్లైయే', 'రాజాకిలి', 'తిరుమాణిక్యం', 'ద స్మైల్ మెన్', 'వాగై' వంటి సినిమాలున్నాయి. వీటితో పాటు మోహన్‌లాల్ నటించిన 'బరోజ్' త్రీడీ సినిమా, కిచ్చా సుదీప్ నటించిన 'మాక్స్' వంటి డబ్బింగ్ చిత్రాలు కూడా ఉన్నాయి. ఇదిలావుంటే, ఈ యేడాది సుమారుగా 230 నుంచి 240 చిత్రాల వరకు విడుదలయ్యాయి. అయితే, గత యేడాదితో పోల్చితే మాత్రం ఈ సంఖ్య తక్కువగానే ఉందని సినీ ట్రేడ్ వర్గాలు పేర్కొంటున్నాయి.

అరివళగన్ - ఆది 'శబ్దం'

చిత్రజ్యోతి

దర్శకుడు అరివళగన్, హీరో ఆది కాంబినేషన్‌లో 'శబ్దం' పేరుతో ఓ చిత్రం రూపొందగా, వచ్చే యేడాది ఫిబ్రవరి 28వ తేదీ విడుదల చేయనున్నట్టు మేకర్స్ ప్రకటించారు. ధ్వని (శబ్దం)ని బ్యాక్‌గ్రౌండ్‌గా చేసుకుని ఈ సినిమాను హార్రర్ జోనర్‌లో తెరకెక్కించారు. నిర్మాణాంతర కార్యక్రమాలన్నీ ఎపుడో పూర్తయినప్పటికీ... విడుదలలో జాప్యం నెలకొంది. 7జీ శివ నిర్మాణంలో తెరకెక్కిన ఈ చిత్రంలో సిమ్రన్, లైలా, లక్ష్మీ మేనన్, రెడిన్ కింగ్‌స్లీ తదితరులు నటించారు. ఇప్పటికే టీజర్ రిలీజ్ చేయగా, ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చింది. 'ఈరమ్' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ మూవీ తర్వాత డైరెక్టర్ అరివళగన్ తెరకెక్కించిన ఈ మూవీపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.


'శబ్దం'లో ఆది



'తలైవర్' నుంచి ఎన్నో నేర్చుకున్నాను

● శృతిహాసన్

లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో సూపర్‌స్టార్ రజనీకాంత్ హీరోగా నటిస్తున్న 'కూలి' చిత్రంలో నటించడం ఓ మంచి అనుభూతిని ఇచ్చిందని, 'తలైవర్' నుంచి అనేక విషయాలు నేర్చుకున్నట్టు హీరోయిన్ శృతిహాసన్ వెల్లడించారు. సన్ పిక్చర్స్ పతాకంపై నిర్మాత కళానిధి మారన్ నిర్మిస్తున్న ఈ భారీ చిత్రంలో సత్యరాజ్, నాగార్జున, ఉపేంద్ర, శృతిహాసన్ తదితరులు నటిస్తున్నారు. ఈ నేపథ్యంలో క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని తన అభిమానులకు శుభాకాంక్షలు తెలిపిన శృతిహాసన్.. 'కూలి' చిత్రంలో నటించడంపై తన అనుభవాన్ని వెల్లడించారు. 'క్రిస్మస్ పండుగ రోజున 'కూలి' సినిమా షూటింగ్‌లో పాల్గొనడం ఆనందంగా ఉంది. గత యేడాది తెలుగు చిత్రం 'క్రాక్' షూటింగులో ఉన్నాను. పండుగ రోజులు, పుట్టిన రోజు వేడుకల సమయాల్లో షూటింగ్‌లో ఉండటం ఎంతో ఆనందంగా ఉంటుంది. లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో నటించాలన్నదే నా కోరిక. లోకేష్ చిత్రాలు నాకు ఎంతగానో నచ్చుతాయి. అది 'కూలి' చిత్రంతో తీరిపోయింది. పైగా 'కూలి' చిత్రంలో రజనీకాంత్‌తో కలిసి నటించడం మరిచిపోలేని అనుభూతి. ఆయన నుంచి అనేక విషయాలు నేర్చుకున్నాను' అని శృతిహాసన్ పేర్కొన్నారు.

చదరంగ క్రీడా రారాజుతో హీరోలు

గుకేశ్‌ను అభినందిస్తున్న రజనీకాంత్


ప్రపంచ చదరంగంలో రారాజుగా నిలిచిన డి.గుకేశ్‌ను అగ్రహీరోలైన సూపర్ స్టార్ రజనీకాంత్, శివకార్తికేయన్ తమ గృహాలకు ఆహ్వానించిన అభినందిస్తున్నారు. ఇటీవల సింగపూర్ వేదికగా జరిగిన వరల్డ్ చెస్ చాంపియన్‌షిప్ పోటీల్లో 18 యేళ్ళ గుకేశ్ అత్యంత పిన్నవయస్సులోనే ప్రపంచ చెస్ చాంపియన్‌గా అవతరించిన విషయం తెల్సిందే. ఈ గెలుపుతో టైటిల్‌తో పాటు రూ.11 కోట్ల బహుమతి కూడా అందుకున్నారు. ఈ చెస్ రారాజును దేశంలోని సినీ, రాజకీయ నేతలు అభినందనలతో ముంచెత్తుతున్నారు. ఈ కోవలోనే సూపర్‌స్టార్ రజనీకాంత్ స్వయంగా తేనాంపేట, పోయెస్ గార్డెన్‌లోని తన నివాసానికి గుకేశ్‌ను ఆహ్వానించి, ప్రత్యేకంగా అభినందించి ఓ పుస్తకాన్ని బహూకరించారు. ఈ ఆత్మీయ సమావేశం తర్వాత గుకేశ్ స్పందిస్తూ, 'సూపర్‌స్టార్ రజనీకాంత్ సర్‌కు ధన్యవాదాలు. స్వయంగా ఆహ్వానించి, విలువైన సమయాన్ని వెచ్చించడంతో పాటు అనేక అమూల్యమైన విషయాలు వెల్లడించినందుకు ధన్యవాదాలు' అని పేర్కొన్నారు. కాగా, రజనీకాంత్‌ను కలుసుకున్న వారిలో గుకేశ్ తల్లిదండ్రులు కూడా ఉన్నారు. అలాగే, 'అమరన్' హీరో శివకార్తికేయన్ కూడా గుకేశ్‌ను తన ఇంటికి పిలిచి అభినందించడంతో పాటు ఖరీదైన చేతి గడియారాన్ని బహూకరించారు.


గుకేశ్‌కు రిస్ట్‌వాచ్ బహూకరిస్తున్న శివకార్తికేయన్

'జిల్లు' మంటున్న ఊటీ

● పడిపోయిన కనిష్ఠ ఉష్ణోగ్రతలు



పెరంబూర్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లాలో ప్రతి ఏడాది అక్టోబరు నెలాఖరు వరకు నీటి మంచు కనిపిస్తుంది. నవంబరు రెండో వారం నుంచి చలికాలం ప్రారంభమవుతుంటుంది. ఈ ఏడాది కొన్ని నెలలుగా అప్పుడప్పుడూ భారీ వర్షాలు కురుస్తుండడంతో, కొద్దిరోజులుగా ఎండ తీవ్రత కూడా నెలకొంది. గత వారం నుంచి ఊటీలో మంచు కురవడం ప్రారంభమైంది. కనిష్ఠ ఉష్ణోగ్రతలు 5 డిగ్రీలు నమోదయ్యాయి. బుధవారం నగరంలోని పలు ప్రాంతాల్లో దట్టమైన మంచు కురిసింది. శివారు ప్రాంతాలైన కాంతల్, కలైకుంద, హెచ్‌పీఎఫ్, షూటింగ్ స్పాట్ తదితర ప్రాంతాల్లో మంచుతో ఎదురుగా వచ్చే వారు కూడా కనిపించని స్థితి నెలకొంది.


ఊటీ శివారు ప్రాంతంలో వర్షంలా కురుస్తున్న మంచు

కనిష్ఠ ఉష్ణోగ్రత 1 డిగ్రీ సెల్సియస్...

ఈ నేపథ్యంలో, ఊటీలో గరిష్ఠ ఉష్ణోగ్రత 17 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 3.2 డిగ్రీలు, శివారు ప్రాంతాల్లో 1 డిగ్రీ సెల్సియస్‌గా నమోదైంది. మంచు కారణంగా ఉదయం చలి తీవ్రత కూడా ఉంది. ఉదయం తేయాకు, కొండల్లోని కాయగూరల తోటలకు వెళ్లేందుకు కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అదే సమయంలో, ఊటీ బొటానికల్ గార్డెన్‌లో పూల మొక్కలు దెబ్బతినకుండా పార్క్ అధికారులు తగిన చర్యలు చేపట్టారు.






డ్రైవర్ రహిత మెట్రోరైల్ ట్రయల్ రన్


పూందమల్లి డిపోకు చేరుకున్న మెట్రోరైలు

పెరంబూర్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): డ్రైవర్ రహిత మెట్రో రైలు ట్రయల్ రన్ ప్రారంభమైంది. త్వరలో ఈ రైలు ప్రయాణికులకు అందుబాటులోకి రానుంది. చెన్నై మెట్రో రైల్ లిమిటెడ్ (సీఎంఆర్‌ఎల్) రెండో విడత ప్రాజెక్టులో డ్రైవర్ రహిత మెట్రోరైళ్లు నడపాలని నిర్ణయించింది. అందుకోసం తలా 3 బోగీలతో కూడిన 70 మెట్రోరైళ్లను తయారుచేయాలని నిర్ణయించింది. 'బీఈఎంఎల్' సంస్థతో రూ.3,657.53 కోట్లకు మెట్రోరైళ్ల కొనుగోలు చేసేలా సీఎంఆర్‌ఎల్ ఒప్పందం చేసుకుంది.

డ్రైవర్ రహిత మెట్రోరైళ్ల ట్రయల్ రన్‌ను సీఎంఆర్‌ఎల్ ప్రారంభించింది. అందుకోసం ఒక రైలు, మూడు బోగీలనును గత అక్టోబరు నెలలో పూందమల్లి డిపోకు వేర్వేరుగా తరలించారు. 118.9 కి.మీ రెండవ విడత మెట్రోరైలు ప్రాజెక్టులో పూందమల్లి-పోరూర్ మధ్య నాలుగవ రైలు మార్గం ఏర్పాటవుతోంది. ఈ విషయమై సీఎంఆర్‌ఎల్ అధికారులు మాట్లాడుతూ... డ్రైవర్ రహిత మెట్రోరైలు ట్రయన్ రన్ ప్రారంభించామన్నారు. గంటకు 10 కి.మీ నుంచి 40 కి.మీ వేగంతో తొలివిడత ట్రయల్ రన్ జరుగుతుందని తెలిపారు. అలాగే, పూందమల్లి-పోరూర్ మధ్య గంటకు 40 కి.మీ నుంచి 80 కి.మీ వేగంతో రెండవ విడత ట్రయల్ రన్ నిర్వహించనున్నామన్నారు. బ్రేకింగ్ సిస్టమ్ పూర్తిగా పరిశోధించిన అనంతరం, 2025 డిసెంబరులో పూందమల్లి-పోరూర్ మధ్య ఈ రైళ్లు ప్రయాణికులకు అందుబాటులోకి రానున్నాయని అధికారులు తెలిపారు.

రూ.3.5 కోట్లతో రామేశ్వరం ఆలయ పునరుద్ధరణ



పెరంబూర్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రామేశ్వరం రామనాథ స్వామి ఆలయ పునరుద్ధరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ ఆలయంలో 17వ శతాబ్దంలో ప్రాకారాలు, రాజగోపురాలు నిర్మించారు. ఈ ఆలయంలోని 3వ ప్రాకారానికి ఆసియాలోనే అతి పొడవైనదిగా పేరుంది. ఇక్కడి 2,3వ ప్రాకారాలు, 3వ ప్రాకారంలోని శిల్పాలు దెబ్బతిన్నాయి. ఆలయ ప్రాచీనత పాడవకుండా మద్రాసు హైకోర్టు ఆదేశాలతో సహజ సిద్ధ పదార్థాల మిశ్రమం పూసే పనులు కొన్ని నెలలుగా జరుగుతున్నాయి. ప్రస్తుతం 3వ ప్రాకారంలో 80 శాతం పనులు పూర్తయ్యాయని, మిగిలినవి మరో రెండు నెలల్లో పూర్తవుతాయని ఆలయ అధికారులు తెలిపారు.

కుంభమేళాలో వసతులు ...
రాష్ట్ర భక్తుల కోసం తాత్కాలిక గృహాలు



పెరంబూర్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మహా కుంభమేళాలో పాల్గొనే రాష్ట్ర భక్తుల సౌకర్యార్థం 400 తాత్కాలిక లగ్జరీ గృహాలను ఐఆర్‌సీటీసీ సిద్ధం చేసింది. ఉత్తరప్రదేశ్ ప్రయాగ్‌రాజ్‌లో 12 ఏళ్లకు ఒకసారి మహా కుంభమేళా నిర్వహిస్తుంటారు. ప్రపంచంలోని అతిపెద్ద ఆధ్యాత్మిక, సాంస్కృతిక, మతపరమైన కార్యక్రమాల్లో ఒకటిగా మహా కుంభమేళా పేరుగాంచింది. ఈ క్రమంలో, ప్రయాగ్‌రాజ్‌లో 2025 జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26వ తేది వరకు మహా కుంభమేళా 45 రోజులు జరుగనుంది. ఈ మేళాలో పాల్గొనే భక్తులకు అవసరమైన వసతులను ఆ రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం సంయుక్తంగా చేపడుతున్నాయి. ఐఆర్‌సీటీసీ తమిళనాడు నుంచి వెళ్లే భక్తులకు అన్ని వసతులతో కూడిన తాత్కాలిక గృహాలు అందజేస్తోంది. ఈ విషయమై ఐఆర్‌సీటీసీ విడుదల చేసిన ప్రకటనలో... కుంభమేళాకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్లు, తాత్కాలిక లగ్జరీ గృహాలు అందిస్తున్నాము. మహా కుంభమేళా జరిగే త్రివేణి సంగమం నుంచి 3.5 కి.మీ దూరంలోని ప్రయాగ్‌రాజ్‌లో 400 తాత్కాలిక గృహాలు ఏర్పాటుచేశామన్నారు. 300 డీలక్స్, 100 ప్రీమియం అని రెండు విభాగాల్లో ఈ గృహాలు అందుబాటులో ఉంటాయన్నారు. సకల సదుపాయాలతో ఏర్పాటైన ఈ గృహాలు రూ.16,200 నుంచి అందుబాటులో ఉంటాయి. మరిన్ని వివరాలకు 8076025236 అనే నెంబరు, https://www.irctctourism.com/mahakumbhgram అనే వెబ్‌సైట్ సంప్రదించవచ్చు.



కుంభమేళాకు ఏర్పాటైన తాత్కాలిక లగ్జరీ గృహాలు

ప్రమోద్ హాస్పిటల్‌లో ఉచిత డయాబెటిక్ స్క్రీనింగ్



డయాబెటిక్ స్క్రీనింగ్ చేస్తున్న దృశ్యం

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక తిరువాన్మియూరులోని ప్రమోద్ హాస్పిటల్ తన 15వ వార్షికోత్సవాన్ని గురువారం జరుపుకుంది. ఈ వేడుకలను పురస్కరించుకుని ఉచిత డయాబెటిక్ స్క్రీనింగ్ క్యాంపు నిర్వహించింది. ఈ డయాబెటిక్ స్క్రీనింగ్ క్యాంపు గురువారం నుంచి జనవరి 15వ తేదీ వరకు ఉంటుందని ప్రమోద్ హాస్పిటల్ ఎండీ డాక్టర్ స్ఫూర్తి అరుణ్ ఓ ప్రకటనలో వెల్లడించారు. ఈ ఉచిత స్క్రీనింగ్‌లో నిపుణులైన వైద్యులతో సీబీజీ, బీపీ, బీఎంఐ చెక్, డయాబెటిక్ డైట్ కన్సల్టెంట్ పరీక్షలు చేస్తారు. జనవరి 15వ తేదీ వరకు ప్రతి రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ పరీక్షలు నిర్వహిస్తామని, పూర్తి వివరాలకు, అపాయింట్మెంట్ కోసం 94807 94807, 73050 67962 అనే ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

తిరుపుల్లాణి రాజమహల్‌కు పూర్వవైభవం వచ్చేనా?


దట్టమైన చెట్ల నడుమ తిరుపుల్లాణి రాజమహల్

టి.నగర్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రామనాథపురం జిల్లాలో చారిత్రక ప్రాశస్త్యం కలిగిన ఓ రాజమహల్ కాలగర్భంలో కలిసిపోనుంది. ఆంగ్లేయుల కాలంలో ఆయుధ కర్మాగారంగా, గిడ్డంగిగా ఉపయోగించిన రాజమహల్ నేడు అధ్వాన్నస్థితిలో ఉంది. సేతుపతి చక్రవర్తుల చరిత్రలో కీలకమైన ప్రాంతంగా పేరొందిన రామనాథపురం జిల్లా తిరుపుల్లాణిలోని రాజమహల్‌ను సంరక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ప్రాచీన చారిత్రక చిహ్నాల పరిరక్షణ వేదిక నిర్వాహకులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమైన రామనాథపురం పురావస్తు పరిశోధనా సంఘం అధ్యక్షుడు వి. రాజగురు మాట్లాడుతూ క్రీపూ 1759లో డచ్‌దేశీయులు రామనాథపురం జిల్లా కీళక్కరైలో చేనేత కర్మాగారాన్ని ఏర్పాటు చేయడానికి చక్రవర్తి చెల్లముత్తు సేతుపతి దగ్గర అనుమతి పొందారని, కాలగమనంలో ఆ కర్మాగారం కాస్త కోటలా మార్చేందుకు ప్రయత్నించడంతో యుద్ధ పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఆ తర్వాత సామ్రాజ్య (సంస్థానం) రక్షణ కోసం తిరుపుల్లాణిలో ఓ కోటను నిర్మించాలని నిర్ణయం తీసుకున్న సమయంలో చక్రవర్తి చెల్లముత్తు సేతుపతి కన్నుమూశారని, రెండేళ్ల ప్రాయంలో ముత్తురామలింగ సేతుపతి చక్రవర్తిగా పదవి చేపట్టినప్పుడు, ఆ చక్రవర్తి వద్ద దళవాయిగా పనిచేసిన దామోదరం పిళ్లై తిరుపుల్లాణి ఈ రాజమహల్‌ను నిర్మించినట్లు వివరించారు. క్రీ.శ. 1767నాటి ఒప్పందం ప్రకారం సేతుపతి చక్రవర్తులు, డచ్‌దేశీయుల మధ్య సన్నిహిత సంబంధాలు ఏర్పడ్డాయి. ఫలితంగా ఆంగ్లేయులు క్రీ.శ. 1772లో ఈ సేతు దేశాన్ని కైవశం చేసుకున్న తర్వాత వారి ప్రాబల్యాన్ని బయటి ప్రపంచానికి తెలియనీయకుండా, అటవీ ప్రాంతంలో నిర్మితమైన ఈ రాజమహల్‌ను ఆయుధ కర్మాగారంగా, గిడ్డంగిగా ముత్తురామలింగ సేతుపతి ఉపయోగించారు. ఈ రాజమహల్‌కు దక్షిణం వైపు, తూర్పువైపు ప్రవేశద్వారాలున్నాయి. లోపల చతురస్రాకారంలో నాలుగు నిర్మాణాలున్నాయి. ప్రతి కట్టడం మూలల్లో తలుపున్న నాలుగు గదులు, విశాలమైన లోగిలి మొత్తం 16 గదులు, 16 లోగిళ్లు ఉన్నాయి. ప్రతి కట్టడం నడుమ నీటి సరస్సు కూడా ఉంది. ఈ రాజమహల్‌లోని తలుపులు, కిటికీలు చోరీకి గురయ్యాయి. దీనికి తోడు పైకప్పు, కొన్ని గోడలు శిథిలమయ్యాయి. భవనాల్లో చెట్లు కూడా మొలిచాయి. ఈ రాజమహల్ పైకి వెళ్లడానికి మెట్లున్నాయి. రాజమహల్‌పై యుద్ధవీరులు నిలిచేందుకు ప్రత్యేకమైన బురుజు కూడా ఉంది. భవనంలో నీటి సరస్సులుండటంతో ఈ రాజమహల్‌లో ఆయుధ కర్మాగారం నడిపినట్లు నిర్ధారణ అవుతోంది. ఈ రాజమహల్‌ను పోలిన మరో ఆయుధ కర్మాగారంగా పనిచేసిన రాజమహల్ రఘునాథపురం ప్రభుత్వ మహోన్నత పాఠశాల ప్రాంగణంలో ఉండేది. కాలగర్భంలో ఆ రాజమహల్ అదృశ్యమైంది. అయినా అక్కడ ఆ రాజమహల్ పునాదులు, మొండిగోడగా మిగిలిన ప్రహరీ ఇప్పటికీ కనిపిస్తుంది. తమ ఊరి చిహ్నమైన ఈ రాజమహల్‌ను చారిత్రక వారసత్వ భవనంగా ప్రకటించి సంరక్షించాలని ప్రాచీన చారిత్రక చిహ్నాల పరిరక్షణ వేదిక నిర్వాహకులు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.


పురావస్తు పరిశోధకుడు వి. రాజగురు

తెలుగు వికాస సమితి క్యాలెండర్ ఆవిష్కరణ


చిన్నారులకు జ్ఞాపిక ప్రదానం

అడయార్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా గుమ్మడిపూండి తాలూకాలో తెలుగు వికాస సమితి ఆధ్వర్యంలో 2025 సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ బుధవారం జరిగింది. పాదిరివేడులోని ఆర్‌ఆర్ మహల్‌లో జరిగిన ఈ వేడుకలకు తెలుగు వికాస సమితి (తెవిస) అధ్యక్షుడు పోజుల ముద్దుకృష్ణుడు అధ్యక్షత వహించగా, తెవిస గౌరవాధ్యక్షుడు ఏవీ రామకృష్ణ సారథ్యం వహించారు. ముఖ్య అతిథులుగా నగరానికి చెందిన ప్రముఖ సైంటిస్ట్ డాక్టర్ కిల్లంపల్లి శ్రీనివాస రావు, జనని ప్రధాన కార్యదర్శి గుడిమెట్ల చెన్నయ్య, తమిళనాడు తెలుగు పీపుల్ సొసైటీ వ్యవస్థాపకులు దేవరకొండ రాజు, ఆత్మీయ అతిథులుగా ప్రముఖ వైద్యురాలు, చెన్నై కార్పొరేషన్ 87వ వార్డు కౌన్సిలర్ డాక్టర్ ఏపీ పూర్ణిమ, లయన్ వైవీ రమేష్‌లు పాల్గొన్నారు. ఆరణిలోని ప్రభుత్వ మహిళా మహోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు గోసు గజేంద్రబాబు ప్రార్థనా గీతంతో ఈ కార్యక్రమం ప్రారంభించగా, శాంతా భాస్కర్ శిష్య బృందం, నాట్యాలయ నాట్య బృందాలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. తెలుగు వికాస సమితి కార్యదర్శి వెలుగుల కృష్ణమోహన్ నాయుడు స్వాగతం పలుకగా, సాంస్కృతిక విభాగా నిర్వాహకురాలు ములికి షణ్ముఖం సమితి సమాచారాన్ని వెల్లడించారు. గుమ్మిడిపూండికి చెందిన డాక్టర్ కొండూరు వెంకట సుబ్బరాజు (రాజు క్లినిక్) చేతుల మీదుగా తెలుగు క్యాలెండరును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీ నిర్వహించి విజేతలకు నగదు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు వికాస సమితి ఉపాధ్యక్షుడు నందిమండలం వెంకట రామరాజును సన్మానించారు.


విజేతకు బహుమతి ప్రదానం

'ట్రాఫిక్ ఐలాండ్'కు బాలచందర్ పేరు



'నేమ్ బోర్డు' ఆవిష్కరణలో మంత్రి నెహ్రూ తదితరులు

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి స్టాలిన్ ఆదేశాల మేరకు తేనాంపేట జోన్ 123వ వార్డు లజ్ చర్చి రోడ్డు, కావేరి హాస్పిటల్ సమీపంలో ఉన్న ట్రాఫిక్ ఐలాండ్‌కు కొత్తగా సినీ దర్శక దిగ్గజం కె.బాలచందర్ ట్రాఫిక్ ఐలాండ్‌గా నామకరణం చేశారు. ఈ మేరకు ఏర్పాటు చేసిన నేమ్ బోర్డును పురపాలక శాఖామంత్రి కేఎన్ నెహ్రూ గురువారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మేయర్ ఆర్. ప్రియ, దక్షిణ చెన్నై ఎంపీ తమిళిచ్చి తంగపాండియన్, మైలాపూర్ ఎమ్మెల్యే టి.వేలు, డిప్యూటీ మేయర్ మహేశ్ బాబు, తమిళనాడు హౌసింగ్ బోర్డు చైర్మన్ పూచ్చి మురుగన్, సినీ నటుడు ఎస్వీ శేఖర్, కార్పొరేషన్ కమిషనర్ కుమరగురుబరన్, కె.బాలచందర్ కుమార్తె పుష్ప కందస్వామి, కుటుంబ సభ్యులు, కె.బాలచందర్ అభిమాన సంఘం నిర్వాహకులు పాల్గొన్నారు.

'లైమ్‌లైట్' ఎక్స్‌క్లూజివ్

● ప్రారంభించిన నటి నిక్కీ గల్రానీ

అడయార్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఫాస్ట్ ల్యాబ్ గ్రోన్ డైమండ్ జ్యూవెలరీ బ్రాండ్‌గా గుర్తింపు పొందిన లైమ్‌లైట్ తన 23వ షోరూమ్‌ను నగరంలో నెలకొల్పింది. ఈ షోరూమ్‌ను ప్రముఖ సినీ నటి నిక్కీ గల్రానీ తాజాగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో లైమ్‌లైట్ డైమండ్స్ బ్రాండ్ ఎండీ పూజా సేథ్ మాధవన్, సహ వ్యవస్థాపకుడు నీరవ్ భట్, ప్రాంతీయ భాగస్వాములు వి.శ్రీనివాసన్, కె.కృష్ణమూర్తి, వి.ఉదయకుమార్‌లు పాల్గొన్నారు. ఈ యేడాది ముగింపు నాటికి మరో ఏడు షోరూమ్‌లను ప్రారంభించనున్నట్టు నీరవ్ భట్ ఈ సందర్భంగా వెల్లడించారు. ఈ సందర్భంగా నిక్కీ గల్రానీ మాట్లాడుతూ, 'ఈ షోరూమ్‌లో ఉన్న డైమండ్స్ ఆభరణాల డిజైన్స్ చూసి ఆశ్చర్యపోయానని, ఇవన్నీ మన దేశంలోనే తయారు చేశారన్నారు.

ప్రారంభోత్సవంలో ఓ హారాన్ని ప్రదర్శిస్తున్న నిక్కీ గల్రానీ




'కొండ'ంత జనం

వరుస సెలవులతో భక్తులు తిరుమలకు పోటెత్తారు. ఎటు చూసినా రద్దీనే కనిపిస్తోంది. సర్వదర్శన క్యూ కృష్ణతేజ గెస్ట్‌హౌస్ మీదుగా రింగురోడ్డులో శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వీరికి దాదాపు 20 గంటల దర్శన సమయం పడుతోంది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

ఒక రోజు ముందే పింఛన్ల పంపిణీ

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఈనెల 31వ తేదీనే పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు గురువారం తెలిపారు. జిల్లాలో 2,63,995 మంది లబ్ధిదారులకు సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.112 కోట్లు కేటాయించిందన్నారు. 31న అందని వారికి జనవరి 2వ తేదీన పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.


శిలాతోరణం సర్కిల్ దాకా క్యూలైన్

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 20 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్‌2లోని 31 కంపార్టుమెంట్లలో, నారాయణగిరి షెడ్లలో సర్వదర్శన భక్తులు నిండిపోయారు. శిలాతోరణం సర్కిల్ వరకు క్యూలైన్‌లో భక్తులు వేచివున్నారు. వైకుంఠం క్యూకాంప్లెక్స్‌1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచివున్నారు.

మంగళవారం నాటి హుండీ ఆదాయం: రూ.4.14 కోట్లు


బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 73,301

తలనీలాలు సమర్పించినవారు: 26,242



బొక్కసం సూపరింటెండెంట్‌గా

మళ్లీ గురురాజ్ స్వామి



- గత ప్రభుత్వంలో కక్షసాధింపు చర్యలకు గురైన వైనం
- తొలుత ఆలయం, ఆపై తిరుమల నుంచే బదిలీ
- తాజాగా శ్రీవారి ఆలయంలో పోస్టింగ్

తిరుపతి/తిరుమల, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయం బొక్కసం సూపరింటెండెంట్‌గా గురురాజ్ స్వామి గురువారం తిరిగి బాధ్యతలు స్వీకరించారు. గత ప్రభుత్వంలోని అధికారులు కక్షసాధింపుతో ఆయన్ను మార్చిలో శ్రీవారి ఆలయం నుంచి తిరుపతికి బదిలీ చేసిన విషయం తెలిసిందే. శ్రీవారి ఆలయంతో ఎంతో అనుబంధమున్న ఆయన తిరుమల నుంచి వెళుతూ కన్నీరు పెట్టుకోవడం అప్పట్లో చర్చనీయాశంగా మారింది. ఈయన గురురాజ్ స్వామి 2002లో టీటీడీలో టెంపుల్ ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగంలో చేరారు. తొలి నుంచీ శ్రీవారి ఆలయంలోనే విధులు నిర్వర్తించారు. ఆపై బొక్కసం క్లర్కుగా, తర్వాత బొక్కసం సూపరింటెండెంట్‌గా పదోన్నతులు పొందారు. శ్రీవారి ఆలయంలో బొక్కసం ఇంఛార్జి డాలర్ శేషాద్రి వద్ద సహాయకుడిగా ఉంటూ శ్రీవారి కైంకర్యాలు, పూజాదికాలు, ప్రత్యేక దినాలు, ఉత్సవాల్లో కార్యక్రమాల నిర్వహణపై అవగాహన పెంచుకున్నారు. ముఖ్యంగా బొక్కసం క్లర్కుగా, సూపరింటెండెంట్ హోదాల్లో శ్రీవారి ఆలయంలో మూలవిరాట్టుకు, ఉత్సవమూర్తులకు రోజువారీ, ప్రత్యేక దినాల్లో అలంకరించే అత్యంత విలువైన ఆభరణాలు, బంగారు, వెండి వస్తువులన్నీ ఈయన అధీనంలోనే ఉండేవి. మూలవిరాట్టుకు, ఉత్సవరకుల ఏ రోజుల్లో ఏ ఆభరణాలు అలంకరించాలన్న దానిపైనా లోతైన అవగాహన ఉంది. ఆలయంలో అర్చకులకు, టీటీడీ అధికారులకు నడుమ సంధానకర్తగా, సమన్వయకర్తగానూ వ్యవహరించేవారు. సుమారు రెండు దశాబ్దాల పాటు శ్రీవారి ఆలయంలో పని చేసినా ఆయనపై ఎలాంటి ఆరోపణలు, ఫిర్యాదులూ వచ్చిన దాఖలాలు లేవు. అయితే శ్రీవారి ఆలయంలో కీలకంగా వ్యవహరించే క్రమంలో దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖులు, వివిధ మఠాధిపతులు, పీఠాధిపతులతో పరిచయాలు ఏర్పడ్డాయి. సరిగ్గా అక్కడే గత వైసీపీ ప్రభుత్వంలో టీటీడీ ఉన్నతాధికారి ఒకరికి నచ్చలేదన్న ప్రచారం జరిగింది. ఆ కారణంగా గురురాజ్‌స్వామిని తొలుత 2020లో శ్రీవారి ఆలయం నుంచి వెలుపలికి బదిలీ చేశారు. వైభవోత్సవ మండపంలో విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. తర్వాత ఈ ఏడాది మార్చి 8న తిరుమల నుంచీ తిరుపతిలోని టీటీడీ అకౌంట్స్ విభాగానికి బదిలీ చేశారు. అదే రోజున ఆయన శ్రీవారిని దర్శించుకుని ఆలయం నుంచీ వెలుపలికి వచ్చి విలపిస్తూ వెళ్లిపోయారు. వాస్తవానికి డాలర్ శేషాద్రి మరణంతో ఆయన స్థానాన్ని గురురాజ్‌స్వామితో భర్తీ చేస్తారని టీటీడీ వర్గాలు భావిస్తున్న తరుణంలో ఆయన్ను ఏకంగా తిరుమల నుంచే కిందకు బదిలీ చేయడం అందరినీ ఆశ్చర్యపరిచింది. ఉద్యోగంలో చేరినప్పటి నుంచీ శ్రీవారి సన్నిధిలోనే గడిపానని, వైభవోత్సవ మండపానికి బదిలీ చేసినా కొండపైనే శ్రీవారి ఆలయ సమీపాన్నే కాబట్టి సంతోషంగా విధులు నిర్వర్తించానని అప్పట్లో ఆయన సన్నిహితులకు చెప్పుకొన్నారు. అయితే కొందరు కక్షకట్టి తిరుమలలోనే ఉండకుండా బదిలీ చేయించడం తట్టుకోలేకపోతున్నానంటూ వాపోయారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక టీటీడీపై దృష్టి సారించిన సంగతి తెలిసిందే. అందులో భాగంగా శ్రీవారి ఆలయంలో బొక్కసం నిర్వహణకు, అలాగే అర్చకులు, అధికారుల నడుమ సమన్వయానికి సంబంధించి అవగాహన కలిగిన ఉద్యోగులు లేకపోవడాన్ని ఉన్నతాధికారులు గుర్తించినట్టు సమాచారం. దీంతో గురురాజ్‌స్వామిని తిరిగి శ్రీవారి ఆలయానికి బదిలీ చేస్తూ గురువారం టీటీడీ ఉత్తర్వులు జారీ చేసింది.

> ఈ బదిలీకి సంబంధించి ఎలాంటి మార్పుచేర్పులు, రద్దు వంటి అభ్యర్థనలను, ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకునేది లేదంటూ ఈ ఉత్తర్వుల్లో పేర్కొనడం గమనార్హం. ఈ విధంగా ఏ స్థాయి అధికారికి గానీ బదిలీ ఉత్తర్వుల్లో పేర్కొనడం అత్యంత అరుదనే చెప్పాలి. స్వామివారే తన సేవకు మళ్లీ పిలిపించుకున్నారని గురురాజ్‌స్వామి 'ఆంధ్రజ్యోతి'తో సంతోషం వ్యక్తం చేశారు.

ఎర్రెర్రని జెండా

- ఘనంగా సీపీఐ శత ఆవిర్భావ దినోత్సవం

జిల్లాలో గురువారం సీపీఐ శత ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఎర్ర తోరణాలు, ఫ్లెక్సీలు, జెండాలతో తిరుపతి నగరం ఎరుపెక్కింది. అన్నమయ్య కూడలి నుంచి బైరాగిపట్టెడలోని పార్టీ కార్యాలయం వరకు కళాబృందాలతో ర్యాలీ నిర్వహించారు. పద్మావతి పార్క్ వద్ద కేక్ కట్ చేశారు. పార్టీ కార్యాలయంలో పతాకావిష్కరణ చేశారు. అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. పార్టీ వందేళ్ల చరిత్రను గుర్తు చేస్తూ ప్రజానాట్యమండలి కళాకారులు ఆలపించిన విప్లవ గీతాలు ఆకట్టుకున్నాయి. అమరవీరుల త్యాగాల స్ఫూర్తిగా ప్రజా సమస్యలపై పోరాటాలు చేయడానికి ముందుకురావాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పి.హరినాథరెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి పి.మురళి, నగర కార్యదర్శి విశ్వనాథ్, కె.శివారెడ్డి, సి.పెంచలయ్య, రాధాకృష్ణ, బి.నదియా, చంద్రశేఖరరెడ్డి, ఎన్.డి.రవి, గుర్రప్ప, నాగరాజు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

- తిరుపతి(ఆటోనగర్), ఆంధ్రజ్యోతి



పార్టీ కార్యాలయంలో జెండా ఆవిష్కరిస్తున్న హరినాథ రెడ్డి తదితరులు



తిరుపతిలో సీపీఐ నేతల ర్యాలీ

పడవ పోటీల ప్రాక్టీస్ సెషన్స్ ప్రారంభం



రాయలచెరువులో బోట్లను పరిశీలిస్తున్న శాప్‌చైర్మన్ రవినాయుడు

రామచంద్రాపురం/తిరుపతి(క్రీడలు), డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): రామచంద్రాపురం మండలం రాయలచెరువులో గురువారం పడవ (డ్రాగన్ బోట్) పోటీల ప్రాక్టీస్ సెషన్స్ ప్రారంభమయ్యాయి. చిత్తూరు, నెల్లూరు, కర్నూలు, విజయవాడ, వైజాగ్ జిల్లాల నుంచి జూనియర్, సీనియర్ విభాగాలకు 40మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఉదయం 7.30 నుంచి సాయంత్రం 5.30గంటల వరకు ప్రాక్టీసు సెషన్స్ కొనసాగాయి. చెరువులో 1,000మీటర్ల పొడవుతో 30రౌండ్స్ వేశారు. ఒక్కోదానిలో 12మంది చొప్పున కూర్చొని పడవను వేగంగా ముందుకు నడిపారు. చిన్న పడవల్లో ఒక్కొక్కరూ నడిపారు. క్రీడాకారులు చేస్తున్న పొరపాట్లను అక్కడే ఉన్న కోచ్‌లు గమనించి ముఖకవళికలతో కూడిన శిక్షణ ఇచ్చారు. ఇలా 29వ తేదీ వరకు ప్రాక్టీస్ సెషన్స్ చేస్తూ 30, 31 తేదీల్లో అధికారిక టైమింగ్స్‌కు పడవ పోటీలు నిర్వహిస్తారు. అందులో ప్రతిభ కనబరిచినవారు జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధిస్తారు. గురువారం శాప్‌చైర్మన్ రవినాయుడు రాయలచెరువులో పర్యటించి పడవ పోటీల ప్రాక్టీస్ సెషన్స్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు తిరుమలరెడ్డి, రాయలచెరువు నీటి సంఘం ఉపాధ్యక్షుడు దేవరాజులు, రాయలచెరువుపేట సర్పంచ్ మురగయ్య, మాజీ సర్పంచ్ మాధవి, నీటి సంఘాల అధ్యక్షులు నరసింహారెడ్డి, ఎంపీడీవో ఇందిరమ్మ, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రేమజంట ఆత్మహత్యాయత్నం

చిత్తూరు అర్బన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఓ ప్రేమజంట ఆత్మహత్యకు యత్నించిన ఘటన చిత్తూరు రెండో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. చంద్రగిరికి చెందిన గురవయ్య కుమారుడు భరత్ (21), కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన తాయమ్మ కుమార్తె రాజేశ్వరి (19)లు తిరుపతిలోని రెడ్డి అండ్ రెడ్డి కాలనీలో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో పని చేస్తున్నారు. ఐదునెలలుగా ప్రేమించుకున్న వీరు గురువారం చంద్రగిరిలోని మూలస్థాన ఎల్లమ్మ గుడిలో వివాహం చేసుకున్నారు. భరత్ స్నేహితుడు చిత్తూరులోని రామ్‌నగర్‌కాలనీ విస్డమ్ స్కూల్ సమీపాన నివాసం ఉండగా, సాయంత్రం అక్కడికి చేరుకున్నారు. తర్వాత స్నేహితుడికి ఫోన్ చేయగా అతను స్పందించక పోవడంతో భయపడి తమ వెంట తెచ్చుకున్న రసాయనాన్ని తాగేశారు. స్థానికులు గమనించి, వారిని చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వేలూరు సీఎంసీకి తీసుకెళ్లారు. పోలీసులు విచారిస్తున్నారు.

పరిశ్రమలు వస్తున్నాయి.. సహకరించండి

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు పలు పరిశ్రమలు వస్తున్నాయని, భూసేకరణకు సహకరించాలని సత్యవేడు మండల రైతులను కలెక్టర్ వెంకటేశ్వర్ కోరారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లో సత్యవేడు మండలం తొల్లడం, పెద్దఈటిపాకం, ఇరుగళం, చిన్న ఈటిపాకం రైతులతో ఆయన సమావేశమయ్యారు. ఆయా గ్రామాల్లోని సుమారు 55.66 ఎకరాల భూసేకరణకు ఈనెల 15న ప్రాథమిక నోటిఫికేషన్ ఇచ్చినట్లు తెలిపారు. అందులో 40 ఎకరాల పట్టా భూమి ఉందని, ఆ మేరకు రైతులతో నష్టపరిహారంపై జేసీ శుభం బన్సల్‌తో కలిసి కలెక్టర్ చర్చించారు. సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి పాల్గొన్నారు.

తిరుమలలో రేపు డయల్ యువర్ ఈవో

తిరుమల, డిసెంబరు26(ఆంధ్రజ్యోతి): టీటీడీ డయల్ యువర్ ఈవో కార్యక్రమం శనివారం ఉదయం 9 నుంచి 10 గంటల వరకు తిరుమలలో జరుగనుంది. భక్తులు తమ సందేహాలు, సూచనలు, ఫిర్యాదులపై టీటీడీ ఈవో శ్యామలరావుతో ఫోన్ ద్వారా నేరుగా మాట్లాడవచ్చు. సంప్రదించాల్సిన ఫోన్ నెంబరు: 0877 2263261.

ఆగివున్న లారీని ఢీకొన్న మినీలారీ

- డ్రైవర్ మృతి





ప్రమాదంలో దెబ్బతిన్న లారీ ముందుభాగం - లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్ రాజా

దొరవారిసత్రం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం కుప్పారెడ్డిపాలెం సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం అర్ధరాత్రి ఆగివున్న లారీని వెనుకవైపు నుంచి మినీలారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో తమిళనాడుకు చెందిన మినీలారీ డ్రైవర్ రాజా కరుపాల్యా(27) మృతి చెందాడు. సౌక కొయ్యల లోడుతో వెళ్తున్న లారీ టైరు పంక్చర్ కావడంతో కుప్పారెడ్డిపాలెం సమీపంలో జాతీయ రహదారిపై ఆగింది. బత్తాయి పండ్ల లోడుతో గుజరాత్ నుంచి చెన్నై వెళ్తున్న మినీలారీ బుధవారం అర్ధరాత్రి ఆగివున్న లారీని వెనుకవైపు నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో సౌక కొయ్యలు మినీలారీ క్యాబిన్‌లోకి చొచ్చుకుపోవడంతో డ్రైవర్ రాజా తీవ్రంగా గాయపడ్డారు. హైవే మొబైల్ పోలీస్ సిబ్బంది స్థానికుల సహకారంతో క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్ రాజా కరుపాల్యాను బయటకు తీసి 108 వాహనంలో సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గదుల జారీని పర్యవేక్షిస్తున్న అదనపు ఈవో

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

తిరుమల, డిసెంబరు26(ఆంధ్రజ్యోతి): తిరుమలలో గదుల జారీ ప్రక్రియను టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. సిఫార్సులున్నప్పటికీ తిరుమలలో గదులు కేటాయించే పద్మావతి, ఎంబీసీ34 కార్యాలయాల వద్ద భక్తులు అధిక సమయం నిరీక్షిస్తూ ఇబ్బంది పడుతున్న విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన విషయం తెలిసిందే. వెంకయ్య చౌదరి పద్మావతి విచారణ కార్యాలయానికి వెళ్లి ఏఏ సిఫార్సులపై గదులు కేటాయిస్తున్నారు, ఏ సమయంలో ఎన్ని గదులు భక్తులు పొందుతున్నారు, అవకతవకలు ఏమైనా జరుగుతున్నాయా, భక్తులకు ఎందుకు ఆలస్యం అవుతోంది, ఎక్కడ గదులు బ్లాక్ అవుతున్నాయి వంటి అంశాలను పరిశీలించారు. భక్తులకు ఇబ్బంది లేకుండా లభ్యతను బట్టి గదులు కేటాయించాలని, వీలైనంతవరకు నిరీక్షణ సమయాన్ని తగ్గించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు.

రేణిగుంటలో డెంగ్యూ కేసు నమోదు

రేణిగుంట, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి) : రేణిగుంటలో డెంగ్యూ కేసు నమోదైంది. రేణిగుంట పంచాయతీ పరిధిలోని బుగ్గవీధిలో ఓ మహిళకు డెంగ్యూ పాజిటివ్‌గా వైద్యులు నిర్ధారించారు. గురువారం ఆ ప్రాంతంలో చుట్టుపక్కల ఇళ్లల్లో నివాసం ఉంటున్న వారి వద్ద ఏఎన్ఎంలు రక్తనమూనాలు సేకరించారు. పంచాయతీ అధికారులు పారిశుధ్య పనులు చేపట్టారు. డెంగ్యూ జ్వరం పట్ల ప్రజలు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఇంటిలోపల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, కాచి చల్లార్చిన నీళ్లు తాగాలని ప్రభుత్వ వైద్య అధికారి డాక్టర్ ప్రకాష్‌రెడ్డి సూచించారు.

టీటీడీ నిధుల వ్యయానికి 'చికిత్స'

- కొన్ని ఆస్పత్రుల నిర్వహణ, నిర్మాణాలకు భారీగా నిధుల కేటాయింపు అవసరమా..
- పరిశీలనకు తాజాగా కమిటీ నియామకం

తిరుమల, డిసెంబరు26(ఆంధ్రజ్యోతి): ఆస్పత్రుల నిర్వహణ, నిర్మాణాల వ్యయంపై టీటీడీ ప్రత్యేక దృష్టి సారించింది. రూ.వేల కోట్ల నిధులను ఆస్పత్రుల పేరుతో మళ్లించడం ఏమేరకు సమంజసమనే దిశగా యోచిస్తోంది. ఇటీవల దీనిపై ప్రత్యేక కమిటీని కూడా ఏర్పాటు చేసింది. టీటీడీ మాజీ ఈవో, పూర్వపు జిల్లా కలెక్టర్, హెల్త్ స్పెషల్ సెక్రటరీగా పనిచేసి రిటైరైన ఐవీ సుబ్బారావు ఆధ్వర్యంలో కమిటీ ఇప్పటికే టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న ఆస్పత్రులను, భవన నిర్మాణాలను పరిశీలించింది. టీటీడీ ఆధ్వర్యంలో స్విమ్స్, ఆయుర్వేద, బర్డ్ వంటి ఆస్పత్రులు నడుస్తున్నాయి. మరోపక్క గత వైసీపీ ప్రభుత్వంలో పద్మావతి చిన్న పిల్లల హృదయాలం ఆస్పత్రి నిర్మాణ పనులనూ ప్రారంభించింది. దీని నిర్మాణానికే దాదాపు రూ.300 కోట్లకుపైగానే కేటాయించింది. స్విమ్స్‌లో బాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ విభాగం, మరో భారీ భవన నిర్మాణాలకు రూ.200 కోట్లకుపైగా కేటాయించారు. గత ప్రభుత్వ హయాంలో మరికొన్ని సూపర్ స్పెషాలిటీ సేవలు అందించేందుకు కూడా భారీగా నిధులు కేటాయిస్తూ నిర్ణయాలు తీసుకున్నారు. వాటిన్నింటికీ దాదాపు రూ.వెయ్యి నుంచి రూ.1,200 కోట్ల వరకు అవసరమవుతుంది.

టాటా సంస్థ ఉండగా మళ్లీ కేన్సర్‌కు నిధులా..

వాస్తవానికి క్యాన్సర్ రోగులకోసం ఇప్పటికే టాటా ట్రస్టు వేంకటేశ్వర ఇనిస్టిట్యూట్ ఆఫ్ క్యాన్సర్ కేర్ అండ్ అడ్వాన్స్ రిసెర్చ్, కాంప్రెస్ క్యాన్సర్ ఆస్పత్రి (స్వీకార్) నిర్మించి సేవలు అందిస్తోంది. ఈక్రమంలో మళ్లీ బాలాజీ ఇనిస్టిట్యూట్ అంకాలజీ ఎందుకని భావిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం టీటీడీ ఆదాయం కంటే ఖర్చే అధికంగా ఉంటోందని ప్రస్తుత అధికారులు చెబుతున్నారు. ఈనేపథ్యంలోనే ఆస్పత్రుల నిర్వహణ, నిర్మాణాలకు ఈస్థాయిలో నిధులు అవసరమా అనే కోణంలో విశ్లేషిస్తున్నారు. గత ప్రభుత్వంలోని అధికారులు కమీషన్లకు కక్కుర్తిపడి ఇలాంటి నిర్ణయాలు తీసుకున్నారని భావిస్తున్నారు. స్విమ్స్ నిర్వహణే సక్రమంగా లేనప్పుడు కోట్లాది రూపాయల కేటాయించడం ఎంతమేరకు సబబనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ప్రత్యేక కమిటీ ఈ మొత్తం వ్యవహారంపై నివేదిక ఇచ్చేందుకు కసరత్తు చేస్తోంది.



ఆలయం ముందు జస్టిస్ టీసీడీ శేఖర్

శ్రీవారి సేవలో న్యాయమూర్తులు

తిరుమల, డిసెంబరు26(ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టీసీడీ శేఖర్ గురువారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుప్పల వెంకటరమణ, టేబుల్‌టెన్నిస్ ప్లేయర్ నైనా జైస్వాల్ కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.





జస్టిస్ దుప్పల వెంకటరమణ - నైనా జైస్వాల్

వైసీపీ కార్పొరేటర్ల కొత్త కూటమి

- ఎన్డీయే స్థానిక నేతలను మెప్పించిన తర్వాతే ఆయా పార్టీల్లోకి
- అప్పటివరకు స్వతంత్రంగానే వ్యవహరిస్తాం
- పలు అంశాలపై సుదీర్ఘ చర్చ



సమావేశమైన డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, వైసీపీ కార్పొరేటర్లు

తిరుపతి, డిసెంబరు26 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని కొందరు వైసీపీ కార్పొరేటర్లు కొత్త కూటమిగా ఏర్పాటవుతున్నారు. ఎన్నికల అనంతరం ఎన్డీయే కూటమిలో చేరేందుకు పలువురు విఫలయత్నం చేసిన విషయం తెలిసిందే. ఇందుకుగల అడ్డంకులను సమీక్షించుకుని, వాటిని అధిగమించి టీడీపీ, జనసేనలో చేరేందుకు కార్యాచరణ సిద్ధం చేసుకున్నారు. ఈమేరకు గురువారం అందుబాటులో ఉన్న దాదాపు 10 మంది కార్పొరేటర్లు పాయ్‌వైస్రాయ్ హోటల్లో సమావేశమై చర్చించుకున్నారు. గత వైసీపీ పాలనలో టీడీపీ, జనసేన శ్రేణులను ఇబ్బందిపెట్టని కార్పొరేటర్లను చేర్చుకునేందుకు ఎన్డీయే ప్రభుత్వానికి ఇబ్బందిలేదని, గతంలో తామలా వ్యవహరించలేదు కాబట్టి పార్టీలో చేరేందుకు ఎలాంటి అడ్డంకులు ఉండవని అభిప్రాయపడ్డారు. అయితే ఆయా డివిజన్లలోని స్థానిక నాయకత్వాన్ని కూడా మెప్పించి పార్టీలో చేరేందుకు మార్గం సుగమం చేసుకోవాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. తద్వారా భవిష్యత్తులో ఎలాంటి గందరగోళం లేకుండా ముందుకుపోవచ్చని భావించారు. గత కౌన్సిల్ తీర్మానం మేరకు కార్పొరేటర్లకు నెలలో ఒకసారి శ్రీవారి దర్శనం కల్పించాలని కోరుతూ టీటీడీ చైర్మన్‌ను కలవాలని నిర్ణయం తీసుకున్నారు. ఏదైనా పార్టీలో చేరేవరకు తాము ఎవరికీ అనుకూలంగా ఉండమని, అవిశ్వాసం కూడా పార్టీ నిర్ణయాలమేరకు ఉంటుందని తీర్మానం చేసుకున్నట్టు తెలిసింది. ఈసమావేశంలో డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, కార్పొరేటర్లు నరసింహాచారి (25వ డివిజన్), నరేంద్రనాథ్ (38), దూది కుమారి భర్త శివ(33), కుడితి సుబ్రమణ్యం (36), పొన్నాల చంద్ర (28), దొడ్డారెడ్డి మునిశేఖర్ (11), అనిల్ (50వ డివిజన్) సమావేశానికి హాజరైనట్టు తెలిసింది. మరికొంతమంది ఫోన్ ద్వారా సంఘీభావం తెలిపినట్టు సమాచారం.

రెవెన్యూ సదస్సులకు 730 అర్జీలు

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గురువారం 48 రెవెన్యూ సదస్సులు నిర్వహించగా 730 అర్జీలు వచ్చినట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ వెల్లడించారు. అందులో ఇళ్ల స్థలాల కోసం 114, అసైన్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ల్యాండ్‌పై 45, కుల ధ్రువీకరణ కోసం 1, రీసర్వే 29, ల్యాండ్ గ్రాబింగ్ 11, ఆర్‌వోఆర్ 345, ఇతర విషయాలకు 129 ఉన్నాయని వివరించారు. 58 అర్జీలను అప్పటికప్పుడే పరిష్కరించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు మొత్తం 12,306 అర్జీలు వచ్చాయన్నారు.

డిగ్రీ పరీక్షల్లో ఐదుగురు డీబార్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ పరిధిలో నిర్వహిస్తున్న డిగ్రీ 1, 3, 5 సెమిస్టర్ పరీక్షల్లో ఐదుగురు విద్యార్థులు డీబార్ అయ్యారు. పరీక్షలను పర్యవేక్షిస్తున్న హైపవర్ కమిటీ మదనపల్లె ప్రాంతంలోని పరీక్షా కేంద్రాల్లో మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతున్న ఐదుగురిని గుర్తించి, డీబార్ చేసినట్టు సీఈ దామ్లానాయక్ తెలిపారు.

- అన్నమయ్య విగ్రహం ఘటనలో

నిందితుడి అరెస్టు



తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరం అన్నమయ్య సర్కిల్‌లోని అన్నమయ్య విగ్రహానికి శాంతాక్లాజ్ టోపీ పెట్టిన నిందితుడిని ఈస్ట్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. ఈస్ట్ సీఐ రామకృష్ణ కథనం మేరకు.. అన్నమయ్య విగ్రహానికి టోపీ పెట్టడంతో దుమారం రేగింది. భజరంగదళ్ నాయకులు విగ్రహం వద్ద ఆందోళన చేశారు. ఎంఆర్ పల్లి పరిధిలోని ఉల్లిపట్టెడకు చెందిన ఎస్.విష్ణుప్రతీక్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. అన్నమయ్య సర్కిల్ వద్ద లభించిన సీసీ పుటేజీల ఆధారంగా నిందితుడిని గుర్తించారు. ఇతడు మహారాష్ట్రలోని పర్భానీ తాలూకా పెడ్గోన్ గ్రామానికి చెందిన భందుదార్జి జవహర్‌గా గుర్తించారు. 15 రోజుల కిందట తిరుపతికి వచ్చిన ఇతడు.. చిత్తు పేపర్లు ఏరుకుంటూ ప్లాట్‌ఫారాలపై పడుకునేవాడు. ఈనెల 23న శాంతాక్లాజ్ టోపీ దొరకగా అన్నమయ్య విగ్రహంపై ఉంచాడు. ఇతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ చెప్పారు.

పశుగణనను వేగవంతం చేయండి

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పశుగణన ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. గురువారరం కలెక్టరేట్‌లో పశుసంవర్ధకశాఖ అధికారులతో ఆయన సమీక్షించారు. జిల్లాలో పాల ఉత్పత్తి పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా పశుగ్రాసం పెంపకం, మినీ గోకుల షెడ్ల నిర్మాణ లక్ష్యాలను సాధించే దిశగా కృషి చేయాలన్నారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవికుమార్, అధికారులు ఉమామహేశ్వరి పాల్గొన్నారు. కాగా, ఉద్యాన పంటలపై రైతులకు అవగాహన కల్పించాలని ఉద్యానవన శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లో ఆయన ఆ శాఖ అధికారులతో సమీక్షించారు.

అమ్మవారి సేవలో తమిళనాడు గవర్నర్

తిరుచానూరు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): తిరుచానూరులోని పద్మావతి అమ్మవారిని గురువారం తమిళనాడు గవర్నర్ ఆర్‌ఎన్‌రవి కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. డిప్యూటీ గోవిందరాజన్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, అర్చకులు వారికి సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. దర్శనానంతరం రవిని వేదపండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.



మహిళలపై దాడిచేస్తే కఠినంగా శిక్షించాలి

- మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్



తిరుమల, డిసెంబరు26(ఆంధ్రజ్యోతి): మహిళలపై దాడులు చేస్తున్నవారిని కఠినంగా శిక్షించాలని మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ అన్నారు. కఠినమైన శిక్షలు అమలుచేస్తేనే నేరాలు చేయాలనుకునేవారిలో భయం కలుగుతుందని అభిప్రాయపడ్డారు. అప్పుడే ఆడవారికి నిజమైన రక్షణ కల్పించవచ్చన్నారు. తిరుమల శ్రీవారిని గురువారం దర్శించుకున్న ఆయన.. ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. మహారాష్ట్రలో ఎన్నికలు ప్రశాంతంగా, న్యాయంగా జరిగిన క్రమంలో శ్రీవారిని దర్శించుకునేందుకు తిరుమలకు వచ్చినట్టు తెలిపారు. స్వామిని దర్శించుకోమని ఎవరు ఎలాంటి ప్రచారం చేయకపోయినప్పటికీ రోజురోజుకు భక్తుల సంఖ్య పెరుగుతుండటం శ్రీవారి మహిమ అన్నారు.